# నవజ్యోతి

తెలుగు దినపత్రిక

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి: 01 సంచిక : 278 | ఎడిటర్.: మన్నే లక్ష్మణ్ | వెల:5/- | పేజీలు: 8 | మంగళవారం 28-07-2026


## భారత్-శ్రీలంక ఎన్నికల సహకారం



- ఎన్నికల నిర్వహణపై చర్చలు
- శిక్షణకు ప్రాధాన్యం
- సహకారం మరింత విస్తరణ

2

## నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు...

- వలస కూలీల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు.
- ప్రధానో పాధ్యాయుడు వినూత్న చైతన్య కార్యక్రమం.



8



## ఇషా సింగ్ స్వర్ణ విజయం

- మను బాకర్‌కు కాంస్యం
- షూటర్లకు ముఖ్యమంత్రి అభినందనలు
- భారత్‌కు డబుల్ పోడియం గౌరవం

2

స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ క్రీడాకారిణి ఇషా సింగ్‌కు, కాంస్య పతకం గెలుచుకున్న భారత షూటర్ మను బాకర్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.




# హైడ్రాపై హైకోర్టు ఆగ్రహం

- కమిషనర్ మార్పునకు ఆదేశాలు
- ఐజీ స్థాయి అధికారిని నియమించాలి
- కోర్టు ధిక్కరణలపై తీవ్ర వ్యాఖ్యలు

2

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారశైలిపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. వరుసగా కోర్టు ధిక్కరణ పిటిషన్లు నమోదవుతున్న నేపథ్యంలో ఆయనను హైడ్రా కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించి, ఆ స్థానంలో ఐజీ స్థాయి అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. కోర్టు ఉత్తర్వుల అమలులో నిర్లక్ష్యాన్ని సహించబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా లోతుకుంట పరిధిలోని సర్వే నంబర్లు 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమికి సంబంధించిన వ్యవహారం విచారణ సందర్భంగా ఏవీ రంగనాథ్ అఫిడవిట్ దాఖలు చేశారు.

# తిరుపతిలో తొలి కరోనా కేసు



- రాష్ట్రంలో 49కు చేరిన కేసులు
- ఆసుపత్రుల్లో 24 మందికి చికిత్స
- అప్రమత్తమైన వైద్యారోగ్య శాఖ

**అమరావతి, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి):**

ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వైరస్ వ్యాప్తి మరోసారి ఆందోళన కలిగిస్తోంది. తాజాగా తిరుపతిలో తొలి కరోనా కేసు నమోదైంది. తిరుపతి అర్బన్ ప్రాంతానికి చెందిన 65 ఏళ్ల వృద్ధురాలికి కరోనా వైరస్ నిర్ధారణ కావడంతో జిల్లా వైద్య యంత్రాంగం అప్రమత్తమైంది. గత కొన్ని రోజులుగా శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించగా, జూలై 23న నిర్వహించిన పరీక్షల్లో

మిగతా 2 లో..

## నాలుగు గంటల్లో గ్యాస్ డెలివరీ

- తేలికైన కొత్త సిలిండర్
- ఐఓసీఎల్ కొత్త సేవల ప్రారంభం
- నాలుగు నగరాల్లో అందుబాటు



**న్యూఢిల్లీ, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి):**

ఎల్పీజీ వినియోగదారులకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ కొత్త సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. "ఇండేన్ ఎక్స్‌ట్రాలైట్ నౌ" పేరుతో తేలికైన 10 కిలోల కాంపోజిట్ గ్యాస్ సిలిండర్‌ను ప్రవేశపెట్టడంతో పాటు, బుక్ చేసిన నాలుగు గంటల్లోనే ఇంటికే సిలిండర్‌ను అందించే సేవను ప్రారంభించింది. ప్రస్తుతం ఈ సేవను ఎంపిక చేసిన నాలుగు నగరాల్లో అమలు చేస్తున్నట్లు సంస్థ వెల్లడించింది.

మిగతా 2 లో..



## కేసీఆర్ పరామర్శ.. ధైర్యం నింపిన భరోసా

- పెద్ది ఆరోగ్యంపై కేసీఆర్ ఆరా
- యశోద ఆస్పత్రిలో కుటుంబానికి భరోసా
- అత్యున్నత వైద్య చికిత్సపై సమీక్ష
- అండగా ఉంటామని బీఆర్ఎస్ అధినేత హామీ

**హైదరాబాద్, జూలై 16 (నవజ్యోతి ప్రతినిధి):**

భారత్–యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య అమల్లోకి వచ్చిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) ద్వారా తెలంగాణకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి గురువారం సచివాలయంలో యూకే డిప్యూటీ ట్రేడ్ కమిషనర్ (దక్షిణాసియా) చంద్రు కె. అయ్యర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

మిగతా 2 లో..

## మతం మారితే ఎస్సీ హోదా రద్దు

- రివ్యూ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు
- 1950 రాజ్యాంగ ఉత్తర్వులకే మద్దతు



2



## ప్లాస్టిక్ నోట్లకు గ్రీన్ సిగ్నల్

- రూ.10, రూ.20 నోట్లపై ప్రయోగాలు
- ఆర్బీఐ ప్రతిపాదనకు కేంద్ర ఆమోదం
- మన్నిక, పనితీరుపై క్షేత్రస్థాయి పరీక్షలు

2

## తెలంగాణ రక్షణ సేన విస్తరణ

మరో 19 స్థానాలకు ఇన్‌చార్జ్‌ల నియామకం



2






## ఫోరెన్సిక్ ప్రయోగశాలకు కొత్త బలం



2

- 57 మంది శాస్త్రాధికారుల నియామకం
- నియామక పత్రాలు అందజేసిన సి.వి. ఆనంద్
- నేర దర్యాప్తు సామర్థ్యానికి మరింత ఊతం



2

## తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం

## తెలంగాణ రక్షణ సేన విస్తరణ

**హైదరాబాద్, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ రక్షణ సేన సంస్థాగత విస్తరణలో భాగంగా మరో 19 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తూ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రెండో విడత జాబితాను విడుదల చేశారు. ఇప్పటికే 23 అసెంబ్లీ నియోజకవర్గాలకు బాధ్యతలు అప్పగించిన అనంతరం రెండో విడతలో కొత్త నియామకాలు చేపట్టారు. అదే విధంగా తొమ్మిది లోక్‌సభ నియోజకవర్గాలకు కూడా ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తూ సంస్థాగత బలోపేతానికి చర్యలు తీసుకున్నారు. రెండో విడత నియామకాలలో వెనుకబడిన తరగతులకు అధిక ప్రాధాన్యం కల్పించారు. మొత్తం 19 అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లలో 10 మంది వెనుకబడిన తరగతుల నాయకులకు అవకాశం కల్పించినట్లు పార్టీ ప్రకటించింది. అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు సామాజిక సమతుల్యతను దృష్టిలో ఉంచుకుని నియామకాలు చేపట్టినట్లు వెల్లడించింది. పార్టీ అనుబంధ విభాగాలకు కూడా రాష్ట్ర స్థాయి బాధ్యతలను ప్రకటించారు. మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా పడాల మనోజ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కనగల చైతన్య, ఉపాధ్యక్షురాలిగా అయిలి కవితను నియమించారు. విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా జానపాటి రాము యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మునుకుంట్ల నవీన్ గౌడ్, ఉపాధ్యక్షురాలిగా చింతలపాటి రాధశ్రీకి బాధ్యతలు అప్పగించారు. బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా అల్లంపల్లి రామకోటి, ప్రధాన కార్యదర్శిగా గొరిగె నర్సింహా, ఉపాధ్యక్షులుగా కుసుమ రజిత, ఈదులకంటి శైలజ గౌడ్‌ను నియమించారు.

## ఫోరెన్సిక్ ప్రయోగశాలకు కొత్త బలం

**హైదరాబాద్, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాలలో 57 మంది కొత్త శాస్త్రాధికారులు విధుల్లోకి చేరారు. తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ వారి చేతుల మీదుగా వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ నియామకాలతో రాష్ట్ర ఫోరెన్సిక్ విభాగం మరింత బలోపేతం కానుందని అధికారులు తెలిపారు. కొత్తగా నియమితులైన వారిలో 36 మంది పీహెచ్‌డీ పట్టభద్రులు, ఆరుగురు ఎం.టెక్, 12 మంది ఎం.ఎస్సీ, ముగ్గురు ఎంసీఏ విద్యార్హతలు కలిగిన వారు ఉన్నారు. అత్యున్నత విద్యార్హతలు కలిగిన నిపుణులు ఫోరెన్సిక్ విభాగంలో చేరడం వల్ల శాస్త్రీయ దర్యాప్తు మరింత సమర్థవంతంగా సాగుతుందని అధికారులు పేర్కొన్నారు. దేశంలో అత్యుత్తమ ఫోరెన్సిక్ ప్రయోగశాలల్లో ఒకటిగా తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాల ఇప్పటికే గుర్తింపు పొందింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శాస్త్రీయ విధానాలతో నేర పరిశోధనలకు అవసరమైన సేవలను అందిస్తూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది.

## నాలుగు గంటల్లో గ్యాస్ డెలివరీ

**మొదటిపేజీ తరువాయి**

సంప్రదాయ ఉక్కు సిలిండర్లతో పోలిస్తే కొత్త 10 కిలోల కాంపోజిట్ సిలిండర్ బరువు తక్కువగా ఉండటంతో దానిని మోయడం, తరలించడం, వినియోగించడం సులభమవుతుందని ఐఓసీఎల్ తెలిపింది. గృహ అవసరాలతో పాటు చిన్న వ్యాపార అవసరాలకు కూడా ఈ సిలిండర్ అనువుగా ఉంటుందని పేర్కొంది. వినియోగదారులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించడమే ఈ కొత్త విధానం లక్ష్యమని వివరించింది. కొత్త డెలివరీ సేవలో వినియోగదారులు తమకు అనుకూలమైన సమయాన్ని ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. డిజిటల్ విధానంలో సులభంగా బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో గ్యాస్ బుకింగ్ ప్రక్రియ మరింత వేగవంతంగా, పారదర్శకంగా మారుతుందని సంస్థ పేర్కొంది. ప్రస్తుతం పుణే, గురుగ్రామ్, ఇండోర్, కోయంబత్తూరు నగరాల్లో ఈ సేవలను ప్రారంభించారు. అక్కడ వినియోగదారుల నుంచి వచ్చే స్పందన ఆధారంగా దశలవారీగా ఇతర నగరాలకు కూడా ఈ సేవలను విస్తరించనున్నట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెల్లడించింది. అదేవిధంగా 5 కిలోల ఇండేన్ ఛోటూ గ్యాస్ సిలిండర్‌కు కూడా నాలుగు గంటల్లో డెలివరీ చేసే సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. చిన్న కుటుంబాలు, విద్యార్థులు, చిన్న వ్యాపారులు ఎక్కువగా వినియోగించే ఈ సిలిండర్‌ను కూడా వేగంగా అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

## తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం

**అమరావతి, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి):**

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆగస్టు 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ బియ్యం విక్రయాలు ప్రారంభం కానున్నాయి. బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సామాన్యులకు ఊరట కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ధరల నియంత్రణతో పాటు ప్రజలపై ఆర్థిక భారం తగ్గించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల ప్రభావం నుంచి ప్రజలను రక్షించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి కుటుంబానికి నాణ్యమైన బియ్యం అందుబాటు ధరలో లభించేలా చర్యలు చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమం అమలులో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. ప్రభుత్వ యంత్రాంగం, బియ్యం మిల్లర్లతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి, ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం అందించే విధంగా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు.

## భారత్-శ్రీలంక ఎన్నికల సహకారం

**న్యూఢిల్లీ, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి):**

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్, అంతర్జాతీయ ప్రజాస్వామ్య, ఎన్నికల సహాయ సంస్థ సభ్య దేశాల మండలి అధ్యక్షుడు జ్ఞానేశ్ కుమార్ న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో భారత్‌లోని శ్రీలంక హై కమిషనర్ మహిషిణి కొలోన్నేతో సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య ఎన్నికల నిర్వహణ, శిక్షణ, పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. భారత్, శ్రీలంక పొరుగు దేశాలుగా చారిత్రక, సాంస్కృతిక సంబంధాలతో పాటు ప్రజాస్వామ్య విలువలను పంచుకుంటున్నాయని సమావేశంలో ఇరు వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఉమ్మడి విలువలే ఎన్నికల వ్యవస్థల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించేందుకు బలమైన పునాదిగా నిలుస్తాయని అభిప్రాయపడ్డాయి.అంతర్జాతీయ ప్రజాస్వామ్య, ఎన్నికల నిర్వహణ సదస్సు–2026లో రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేసేందుకు కలిసి పనిచేయాలని ఇరు పక్షాలు నిర్ణయించాయి. ఎన్నికల నిర్వహణలో అనుభవాల మార్పిడి, ఉత్తమ విధానాల అమలుపై కూడా చర్చించారు. ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ఆధునిక ఎన్నికల నిర్వహణ పద్ధతులపై పరస్పర సహకారాన్ని విస్తరించేందుకు అంగీకరించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా సంయుక్త కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సంస్థాగత సామర్థ్యాల పెంపు వంటి అంశాలపై ఇరు దేశాల ఎన్నికల సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. ఎన్నికల సంస్థల మధ్య నిరంతర సమన్వయంతో ప్రజాస్వామ్య వ్యవస్థలను మరింత పటిష్ఠం చేయడానికి ఈ సమావేశం దోహదపడుతుందని అధికారులు తెలిపారు.

# తిరుపతిలో తొలి కరోనా కేసు

**మొదటిపేజీ తరువాయి**

కరోనా సోకినట్లు నిర్ధారణ అయింది. వృద్ధురాలికి కరోనా నిర్ధారణ అయిన వెంటనే వైద్యులు అవసరమైన చికిత్స అందిస్తున్నారు. ఆమెతో సన్నిహితంగా ఉన్న కుటుంబ సభ్యులకు కూడా వైద్య బృందాలు పరీక్షలు నిర్వహించగా, వారిలో ఎవరికి వైరస్ సోకినట్లు గుర్తించలేదని వైద్యారోగ్య శాఖ వెల్లడించింది. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా కరోనా కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. శనివారం ఒక్కరోజే పది మందికి పైగా కొత్తగా వైరస్ బారిన పడినట్లు వైద్యారోగ్య శాఖ వెల్లడించింది. దీంతో రాష్ట్రంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 49కు చేరింది. ప్రస్తుతం 24 మంది వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో కొత్త కేసులు నమోదుకాగా, కృష్ణా, తిరుపతి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఒక్కో కేసు వెలుగు చూసింది. జిల్లాల వారీగా పరిస్థితిని అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. అవసరమైన చోట్ల వైద్య సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు పర్యవేక్షణను కూడా పెంచారు.

ఇప్పటివరకు రాష్ట్రంలో కరోనా కారణంగా నలుగురు మరణించినట్లు వైద్యశాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆసుపత్రుల్లో అవసరమైన వైద్య సదుపాయాలు, ఔషధాల నిల్వలు, పరీక్షల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు. ప్రజల్లో అనవసర భయాందోళనలు అవసరం లేదని, లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కరోనా వ్యాప్తిని నియంత్రించేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలను మరింత వేగవంతం చేసింది. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, జ్వరం, దగ్గు, శ్వాస సంబంధిత సమస్యలు ఉంటే పరీక్షలు చేయించుకోవడం, అవసరమైన సందర్భాల్లో మాస్కు ధరించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు కొనసాగిస్తామని వైద్యారోగ్య శాఖ వెల్లడించింది.

# మతం మారితే ఎస్సీ హోదా రద్దు

**న్యూఢిల్లీ, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి):**

షెడ్యూల్డ్ కులాలకు చెందిన వ్యక్తి హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను విడిచి క్రైస్తవం లేదా ఇతర మతంలోకి మారితే ఎస్సీ హోదా వెంటనే రద్దవుతుందని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. ఈ అంశంపై గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పునఃపరిశీలన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. దీంతో హైకోర్టు తీర్పు యథాతథంగా కొనసాగనుంది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. 1950 నాటి రాష్ట్రపతి రాజ్యాంగ ఉత్తర్వుల ప్రకారం హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను అనుసరించే షెడ్యూల్డ్ కులాల వారికే ఎస్సీ హోదా వర్తిస్తుందని ధర్మాసనం స్పష్టం చేసింది. మత మార్పిడి జరిగిన వెంటనే ఎస్సీ హోదాతో పాటు దానికి సంబంధించిన రిజర్వేషన్లు, ఇతర ప్రయోజనాలు కూడా అమలులో ఉండవని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పులో ఎలాంటి చట్టపరమైన లోపం లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అందువల్ల పునఃపరిశీలనకు తగిన కారణాలు కనిపించలేదని పేర్కొంటూ రివ్యూ పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు ఉత్తర్వులను యథాతథంగా కొనసాగిస్తూ ధర్మాసనం తన నిర్ణయాన్ని వెల్లడించింది. మతం మారిన వ్యక్తి తిరిగి ఎస్సీ హోదాను పొందాలంటే రాజ్యాంగం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. పుట్టుకతో షెడ్యూల్డ్ కులానికి చెందినవారై ఉండటం, స్వచ్ఛందంగా తిరిగి తమ అసలు మతంలోకి చేరడం, సంబంధిత మూల కుల సమాజం వారిని తిరిగి ఆమోదించడం వంటి షరతులు నెరవేరినప్పుడే ఎస్సీ హోదా పునరుద్ధరణకు అవకాశం ఉంటుందని వివరించింది. ఈ తీర్పు మత మార్పిడి, రిజర్వేషన్లకు సంబంధించిన చట్టపరమైన అంశాలపై స్పష్టత ఇచ్చే నిర్ణయంగా న్యాయవర్గాలు భావిస్తున్నాయి. ఎస్సీ హోదా కల్పనకు సంబంధించిన రాజ్యాంగ నిబంధనలను మరోసారి అత్యున్నత న్యాయస్థానం సమర్థించినట్లు విశ్లేషిస్తున్నారు. రిజర్వేషన్ వ్యవస్థ అమలులో ఈ తీర్పు మార్గదర్శకంగా ఉండే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశవ్యాప్తంగా మత మార్పిడి, కుల ధ్రువీకరణ పత్రాలు, రిజర్వేషన్లకు సంబంధించిన వివాదాల పరిష్కారంలో ఈ తీర్పు కీలక ప్రాధాన్యం సంతరించుకుంది. భవిష్యత్తులో ఇలాంటి కేసుల విచారణలో కూడా ఈ తీర్పును ప్రామాణికంగా పరిగణించే అవకాశం ఉందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.

# హైడ్రాపై హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి):**

సంబంధిత భూమిలో హైడ్రా సిబ్బంది ప్రవేశించలేదని, ఎలాంటి కూల్చివేతలు చేపట్టలేదని అందులో పేర్కొన్నారు. పిటిషనర్ వాస్తవాలను వక్రీకరించి కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. న్యాయవ్యవస్థపై తమకు అత్యున్నత గౌరవం ఉందని పేర్కొంటూ జరిగిన పరిణామాలకు బేషరతుగా క్షమాపణలు కోరారు. అయితే కమిషనర్ సమర్పించిన వివరణతో హైకోర్టు సంతృప్తి వ్యక్తం చేయలేదు. ఇప్పటికే ఆయనపై సుమారు 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు నమోదైన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఒకే అధికారిపై ఇంత పెద్ద సంఖ్యలో ధిక్కరణ కేసులు ఎందుకు నమోదవుతున్నాయని ధర్మాసనం ప్రశ్నించింది. కోర్టు మధ్యంతర ఉత్తర్వులను పాటించడంలో విఫలమవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందా అని ప్రభుత్వ తరపు న్యాయవాదిని నిలదీసింది. న్యాయస్థానాల ఉత్తర్వులను అమలు చేయడం ప్రతి ప్రభుత్వ అధికారికి తప్పనిసరి బాధ్యత అని హైకోర్టు స్పష్టం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం, కోర్టు ఆదేశాలను నిర్లక్ష్యం చేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. ప్రజల హక్కులు, న్యాయవ్యవస్థ గౌరవాన్ని పరిరక్షించే విషయంలో రాజీ పడబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. హైడ్రా కమిషనర్ మార్పుతో పాటు ఐజీ స్థాయి అధికారిని నియమించాలని ఇచ్చిన ఆదేశాలు రాష్ట్ర ప్రభుత్వానికి కీలకంగా మారాయి. ఈ ఆదేశాల అమలుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్న అంశంపై ఆసక్తి నెలకొంది. కోర్టు సూచనల మేరకు పరిపాలనా మార్పులు చేపడుతుందా లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఈ కేసు విచారణలో హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ యంత్రాంగానికి స్పష్టమైన సందేశంగా భావిస్తున్నారు. న్యాయస్థానాల ఆదేశాలను అమలు చేయడంలో జాప్యం లేదా నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని ధర్మాసనం మరోసారి స్పష్టం చేసింది. ప్రభుత్వ అధికారులు చట్టబద్ధమైన విధానాలను అనుసరిస్తూ కోర్టు ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత ఉందని పేర్కొంది.

# ఇషా సింగ్ స్వర్ణ విజయం

**హైదరాబాద్, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి):**

చైనాలోని హ్యాంగ్‌ఝౌలో జరుగుతున్న అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య ప్రపంచకప్ మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ క్రీడాకారిణి ఇషా సింగ్‌కు, కాంస్య పతకం గెలుచుకున్న భారత షూటర్ మను బాకర్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి గౌరవం తీసుకొచ్చిన ఇద్దరు క్రీడాకారిణులను ఆయన ప్రశంసించారు. మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో ఇషా సింగ్ అద్భుత ప్రదర్శన కనబర్చి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా, మను బాకర్ కాంస్య పతకాన్ని అందుకున్నారు. ఒకే పోటీలో భారతదేశానికి చెందిన ఇద్దరు షూటర్లు పతకాలు సాధించడం దేశానికి గర్వకారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ విజయం భారత షూటింగ్ ప్రతిభను ప్రపంచ వేదికపై మరోసారి చాటిందని అన్నారు. తెలంగాణకు చెందిన ఇషా సింగ్ సాధించిన విజయం రాష్ట్రానికి ప్రత్యేక గౌరవాన్ని తీసుకొచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. క్రీడల పట్ల ఆమె చూపిన అంకితభావం, కఠోర సాధన యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు వరుస విజయాలు సాధించడం ఆనందదాయకమని అన్నారు. మహిళా క్రీడాకారులు తమ ప్రతిభతో ప్రపంచ స్థాయిలో రాణిస్తూ దేశ ప్రతిష్ఠను పెంచుతున్నారని ముఖ్యమంత్రి కొనియాడారు. వారి విజయాలు యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడమే కాకుండా, క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యాలను సాధించవచ్చనే సందేశాన్ని ఇస్తున్నాయని పేర్కొన్నారు. ఇషా సింగ్, మను బాకర్ భవిష్యత్తులో కూడా మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో విజయాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ప్రపంచ వేదికపై భారత జెండాను మరింత ఎత్తుకు తీసుకెళ్లేలా ఇద్దరూ తమ ప్రతిభను కొనసాగించాలని శుభాకాంక్షలు తెలిపారు. దేశ కీర్తి ప్రతిష్ఠలను మరింత ఉన్నత స్థాయికి చేర్చాలని ఆశాభావం వ్యక్తం చేశారు. హ్యాంగ్‌ఝౌలో జరుగుతున్న ప్రపంచకప్ పోటీల్లో భారత షూటర్లు కనబరుస్తున్న ప్రతిభ దేశ క్రీడా రంగానికి కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.

# ప్లాస్టిక్ నోట్లకు గ్రీన్ సిగ్నల్

**న్యూఢిల్లీ, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి):**




దేశంలో ప్లాస్టిక్ లేదా పాలిమర్ కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రూ.10, రూ.20 విలువ కలిగిన పాలిమర్ నోట్లను ప్రయోగాత్మకంగా పరీక్షించేందుకు భారతీయ రిజర్వు బ్యాంకు చేసిన ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ద్వారా వెల్లడించారు. ప్రయోగాత్మక కార్యక్రమంలో భాగంగా రూ.10, రూ.20 విలువ కలిగిన వంద కోట్ల చొప్పున పాలిమర్ నోట్లను భారతీయ రిజర్వు బ్యాంకు ముద్రించి చలామణిలోకి తీసుకురానుంది. భారత వాతావరణ పరిస్థితుల్లో ఈ నోట్లు ఎంతకాలం మన్నికగా ఉంటాయి, ప్రజల వినియోగానికి ఎంతవరకు అనుకూలంగా ఉంటాయనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ఈ పరీక్షల ఫలితాల ఆధారంగానే దేశవ్యాప్తంగా వీటి విస్తృత వినియోగంపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.ప్రస్తుతం చలామణిలో ఉన్న కాగితపు కరెన్సీ నోట్లను రద్దు చేసే ఆలోచన ప్రభుత్వం వద్ద లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. పాలిమర్ నోట్లు అందుబాటులోకి వచ్చినప్పటికీ కాగితపు నోట్లు కూడా సమాంతరంగా చలామణిలో కొనసాగుతాయని మంత్రి తెలిపారు. ప్రజలు ప్రస్తుతం ఉపయోగిస్తున్న కరెన్సీ నోట్ల చెల్లుబాటుపై ఎలాంటి ప్రభావం ఉండదని పేర్కొన్నారు. పాలిమర్ నోట్లు సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే ఎక్కువకాలం మన్నికగా ఉంటాయని భారతీయ రిజర్వు బ్యాంకు భావిస్తోంది. ఇవి తేమ, నీరు, మురికి వంటి ప్రభావాలకు తట్టుకునే సామర్థ్యాన్ని కలిగి ఉండటంతో పాటు సులభంగా చిరిగిపోవు. ముఖ్యంగా ఎక్కువగా వినియోగించే తక్కువ విలువ కలిగిన నోట్లు త్వరగా దెబ్బతినకుండా ఉండేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. తక్కువ విలువ కలిగిన కాగితపు నోట్లు తరచూ చిరిగిపోవడం వల్ల వాటిని మళ్లీ ముద్రించాల్సి వస్తోంది. దీంతో ముద్రణ, రవాణా, నిర్వహణ వ్యయాలు పెరుగుతున్నాయి. పాలిమర్ నోట్ల వినియోగం పెరిగితే ఈ ఖర్చులు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అదే సమయంలో నకిలీ కరెన్సీ నియంత్రణలో కూడా పాలిమర్ నోట్లు ఉపయోగకరంగా మారే అవకాశాలను పరిశీలిస్తున్నారు. ప్రపంచంలోని పలు దేశాలు ఇప్పటికే పాలిమర్ కరెన్సీ నోట్లను విజయవంతంగా వినియోగిస్తున్నాయి. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భారతీయ పరిస్థితులకు అనుగుణంగా ఈ ప్రయోగాన్ని చేపడుతున్నారు. ప్రయోగాత్మక దశ విజయవంతమైతే భవిష్యత్తులో దేశవ్యాప్తంగా పాలిమర్ నోట్ల వినియోగాన్ని విస్తరించే అంశంపై భారతీయ రిజర్వు బ్యాంకు, కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనున్నాయి.

# కేసీఆర్ పరామర్శ.. ధైర్యం నింపిన భరోసా

**హైదరాబాద్, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి):**

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్టీ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో విస్తృతంగా మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితి, ఇప్పటివరకు అందించిన వైద్య చికిత్స, తదుపరి చేపట్టనున్న వైద్య విధానాలపై సుదీర్ఘంగా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి వారికి మనోధైర్యం కల్పిస్తూ ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆస్పత్రిలోని అత్యవసర చికిత్స విభాగానికి వెళ్లిన కేసీఆర్ దాదాపు నలభై ఐదు నిమిషాల పాటు అక్కడే ఉండి వైద్య బృందంతో చర్చించారు. పెద్ది సుదర్శన్ రెడ్డికి అందిస్తున్న చికిత్సలో ప్రతి అంశాన్ని తెలుసుకుంటూ, అవసరమైన అన్ని వైద్య సదుపాయాలను అందించాలని వైద్యులను కోరారు. ఎలాంటి పరిస్థితి ఎదురైనా అత్యుత్తమ వైద్య సేవలు అందించడంలో రాజీ పడొద్దని సూచించారు. రోగి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు కుటుంబ సభ్యులకు తెలియజేస్తూ పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని కూడా వైద్యులకు సూచించినట్లు సమాచారం. ఈ సందర్భంగా వైద్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై కేసీఆర్‌కు సమగ్రంగా వివరించారు. గుండె, ఊపిరితిత్తులు, ఇతర కీలక అవయవాలు సక్రమంగానే పనిచేస్తున్నాయని, అయితే మెదడు పూర్తిస్థాయిలో స్పందించేందుకు మరికొంత సమయం అవసరమని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ చికిత్స కొనసాగిస్తున్నామని చెప్పారు. పరిస్థితిని పూర్తిగా అంచనా వేయడానికి మరో 48 గంటలు కీలకమయ్యే అవకాశం ఉందని వైద్యులు వివరించారు. పెద్ది సుదర్శన్ రెడ్డికి ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నామని, అవసరమైతే విదేశాల్లోని నిపుణులతో కూడా సంప్రదింపులు కొనసాగిస్తున్నామని వైద్యులు వెల్లడించారు. అమెరికా సహా పలు దేశాలకు చెందిన వైద్య నిపుణుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ చికిత్స కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఎంఆర్ఐతో పాటు అవసరమైన అన్ని వైద్య పరీక్షలను నిరంతరం నిర్వహిస్తూ, సీనియర్ వైద్యుల బృందం సమీక్షల ఆధారంగా తదుపరి చికిత్స నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వివరించారు.వైద్యుల నుంచి వివరాలు తెలుసుకున్న అనంతరం కేసీఆర్ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి వారికి ధైర్యం చెప్పారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వైద్యులు తమ వంతు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దేవుడి దయ, వైద్యుల నిబద్ధత, ప్రజల ఆశీస్సులతో ఆయన ఆరోగ్యం మెరుగుపడుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కష్టకాలంలో ధైర్యం కోల్పోవద్దని కుటుంబ సభ్యులకు సూచిస్తూ, ఎలాంటి పరిస్థితిలోనూ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

# కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు

- **బిక్నూర్‌లో షెడ్ తొలగింపు, అక్రమ బోర్, నాలా కన్వర్షన్‌పై చర్యలు కోరిన ఫిర్యాదుదారులు..**

**కామారెడ్డి, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి):**



బిక్నూర్ గ్రామానికి చెందిన అందె మహేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్‌ను ప్రజావాణిలో కలిసి ఫిర్యాదు చేశారు. గతంలో కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను గ్రామపంచాయతీ ఈఓ మహేష్ కుమార్ గౌడ్ పూర్తిగా అమలు చేయకుండా, షెడ్డును పూర్తిగా తొలగించినట్లు పత్రికల్లో ప్రకటన ఇవ్వడాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే సర్వే నంబర్ 201/7లో ఎలాంటి అనుమతులు లేకుండా బోర్ వేయడం, అదే భూమికి రాజకీయ ఒత్తిడితో నాలా కన్వర్షన్ చేయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ భూమికి సంబంధించి కామారెడ్డి జూనియర్ సివిల్ కోర్టులో ఓఎస్ నెం.143/2020 కేసు పెండింగ్‌లో ఉన్నందున ఎలాంటి అనుమతులు మంజూరు చేయవద్దని కలెక్టర్‌ను కోరారు. ఈ అంశంపై అదనపు కలెక్టర్ స్పందిస్తూ ఎమ్మార్వోకు తగిన సూచనలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే సంబంధిత ఈఓపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- **అధికారులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశం...**

**కామారెడ్డి, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి):**

ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును నిర్దేశిత గడువులోగా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 88 దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. భూ సమస్యలు, రెవెన్యూ, సంక్షేమ పథకాలు, పెన్షన్లు, ఉపాధి తదితర అంశాలపై ప్రజలు వినతులు సమర్పించారు. అనంతరం జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి శాఖల వారీగా సత్వర చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఫిర్యాదులను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించి చేపట్టిన చర్యలపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్.వై. గిరి, జడ్పీ సీఈవో చందర్, డిప్యూటీ కలెక్టర్ రవితేజతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# సిజెపి తర్వాత మరో జెన్-జీ ఉద్యమం

- **రిజర్వేషన్ విధానంలో సంస్కరణల డిమాండ్‌తో దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తున్న రిజర్వేషన్ హటావో ఆందోళన్**

**న్యూఢిల్లీ, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి):**



సామాజిక మాధ్యమాల వేదికగా ప్రారంభమైన రిజర్వేషన్ హటావో ఆందోళన్ దేశవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తూ యువతలో చర్చకు దారితీస్తోంది. కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం తర్వాత డిజిటల్ వేదికలపై ఎక్కువగా చర్చకు వస్తున్న మరో జెన్–జీ ఉద్యమంగా దీనిని మద్దతుదారులు పేర్కొంటున్నారు. తమకు ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదని చెబుతున్న ఉద్యమ నిర్వాహకులు, రిజర్వేషన్ వ్యవస్థను పూర్తిగా వ్యతిరేకించడం కాదని, కాలానుగుణంగా సంస్కరణలు చేపట్టాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం వైద్య, ఇంజినీరింగ్, ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు పరిమితంగా ఉండటంతో పోటీ తీవ్రంగా పెరిగిందని ఉద్యమ మద్దతుదారులు అంటున్నారు. ప్రతిభకు తగిన గుర్తింపు లభించేలా, అదే సమయంలో అన్ని వర్గాల్లోని ఆర్థికంగా వెనుకబడిన వారికి సమాన అవకాశాలు కల్పించే విధంగా విధానాలను పునఃసమీక్షించాలని వారు కోరుతున్నారు. ఇప్పటికే అభివృద్ధి చెందిన కుటుంబాలకు కాకుండా నిజంగా అవసరమైన వారికి మాత్రమే రిజర్వేషన్ ప్రయోజనాలు చేరేలా అన్ని వర్గాల్లో క్రీమీ లేయర్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దేశంలో మరిన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్యను పెంచాలని ఉద్యమం సూచిస్తోంది.అవకాశాలు పెరిగితే రిజర్వేషన్ అంశంపై నెలకొన్న ఉద్రిక్తత కూడా సహజంగానే తగ్గుతుందని మద్దతుదారులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన కొన్ని తీర్పుల నేపథ్యంలో రిజర్వేషన్ వ్యవస్థలో సంస్కరణలపై జాతీయ స్థాయిలో కొత్త చర్చ మొదలైందని ఉద్యమ మద్దతుదారులు చెబుతున్నారు. ప్రతిభ, సామాజిక న్యాయం, ఆర్థిక వెనుకబాటుతనం మధ్య సమతుల్యత సాధించేలా ప్రభుత్వం, పార్లమెంట్ విస్తృత చర్చ చేపట్టి విధాన నిర్ణయాలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. మరోవైపు, రిజర్వేషన్లు రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయ సాధనమని, వాటికి సంబంధించిన ఏ నిర్ణయమైనా రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా, అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే జరగాలని రిజర్వేషన్లకు మద్దతు తెలిపే వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో రిజర్వేషన్ విధానంపై దేశవ్యాప్తంగా మరోసారి విస్తృత స్థాయిలో చర్చ కొనసాగుతోంది.

# వ్యక్తిగత కారణాలతో ట్రస్ట్ చైర్మన్ రాజీనామా.. ట్రస్ట్ ఆమోదం

**సంగారెడ్డి, జూలై 27 (నవజ్యోతి ప్రతినిది) :**

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్రీ వైకుంఠపురంలో ఉన్న జై శ్రీమన్నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన అర్చకులు, చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీ కందాడై వరదాచార్యులు తన పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు ట్రస్ట్ వ్యవస్థాపక ధర్మకర్తకు అధికారికంగా రాజీనామా పత్రాన్ని సమర్పించారు. రాజీనామా లేఖలో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక, సామాజిక, సేవా కార్యక్రమాల్లో సభ్యులతో కలిసి పనిచేయడం తనకు ఎంతో గౌరవంగా భావించినట్లు పేర్కొన్నారు. అయితే వ్యక్తిగత కారణాలు, ఇతర బాధ్యతల వల్ల ప్రధాన అర్చకులు, చైర్మన్‌గా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సమయాన్ని కేటాయించడం సాధ్యం కాకపోవడంతో స్వచ్ఛందంగా పదవులకు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తన రాజీనామాను ఆమోదించి బాధ్యతల నుంచి విముక్తి కల్పించాలని ట్రస్ట్ నిర్వాహకులను కోరారు. శ్రీ వరదాచార్యులు 2026 జూన్ 4న సమర్పించిన రాజీనామా పత్రాన్ని ట్రస్ట్ పాలకవర్గం పరిశీలించి ఆమోదించినట్లు వెల్లడించారు.



# దివ్యాంగ యువకుడి కలను నెరవేర్చిన మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి బడుగుల

- **ఒక్కరోజు పోలీస్ అధికారిగా రాహుల్‌కు అరుదైన అనుభూతి**

**ఉప్పల్ , జూలై 27,(నవజ్యోతి ప్రతినిధి) :**



పుట్టుకతోనే దివ్యాంగుడైన రాహుల్‌కు పోలీస్ అధికారి కావాలన్న చిరకాల కోరికను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి బడుగుల, ఐపీఎస్ నెరవేర్చారు. మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఈ ఘటన అందరినీ భావోద్వేగానికి గురి చేసింది.మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయానికి ఆహ్వానించిన కమిషనర్ సుమతి బడుగుల, రాహుల్‌ను తన అధికారిక కుర్చీలో కూర్చోబెట్టి పోలీస్ క్యాప్ ధరింపజేసి ఆప్యాయంగా పలకరించారు. అంతేకాకుండా పోలీస్ అధికారిగా ఉండే విధులు, బాధ్యతల గురించి వివరించి అతనితో కొంతసేపు ముచ్చటించారు.తన జీవితకాల కోరిక నెరవేరడంతో రాహుల్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అతని ముఖంలో కనిపించిన చిరునవ్వు అక్కడున్న ప్రతి ఒక్కరినీ హత్తుకుంది. ఈ సందర్భంగా మల్కాజిగిరి పోలీసుల మానవత్వం, ప్రజల పట్ల వారి సానుభూతి మరోసారి చాటిచెప్పిందని పలువురు అభినందించారు. విధి నిర్వహణతో పాటు సమాజంలో ప్రతి ఒక్కరి భావోద్వేగాలను గౌరవిస్తూ మానవీయ విలువలను కాపాడడంలో మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు.

## డా. ఏపీజే అబ్దుల్ కలాంకు ఘన నివాళి

**రామేశ్వర్ పల్లిలో వర్ధంతి సందర్భంగా స్మరణ సభ**



**బిక్కనూర్, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి):**

భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లిలో భారతరత్న, మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త డా. ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డా. కలాం దేశాభివృద్ధికి చేసిన సేవలు, యువతకు అందించిన స్ఫూర్తి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ చేపూరి రాణిరాజు, ఉపసర్పంచ్ గొల్లపల్లి వినోద్ కుమార్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాగర్తి భూమ్ రెడ్డి, పాలకేంద్రం అధ్యక్షుడు తక్కల్ల రవీందర్ రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు మద్ది సూర్యకాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొని డా. ఏపీజే అబ్దుల్ కలాంకు ఘన నివాళులర్పించారు.

## బాగిర్తిపల్లి వంతెన నిర్మాణ పనులకు శ్రీకారం

**ఎన్ఆర్జీఎస్ నిధులతో పనుల ప్రారంభం..**



**భిక్కనూరు, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి):**

భిక్కనూరు మండలంలోని బాగిర్తిపల్లి గ్రామంలో ఎన్ఆర్జీఎస్ (మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం) నిధులతో చేపట్టనున్న వంతెన నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆదేశాల మేరకు ఈ పనులను ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ నర్సింలు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగన్నగారి నరేందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు భీంరెడ్డి, సర్పంచ్ కుంట లింగారెడ్డి, ఉపసర్పంచ్ స్వామి, మాజీ సర్పంచ్ భాగయ్య, అందె దయాకర్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కేపీహెచ్ బీలో విద్యార్థి అదృశ్యం

**కూకట్పల్లి, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి) :**



ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాని ఓ విద్యార్థి అదృశ్యమైన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం... తులసీనగర్, శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన చంద్రయ్య కుమారుడు శంకర్ (19) డిగ్రీ చదువుతున్నాడు. ఈ నెల 26న అర్ధరాత్రి దాటిన తర్వాత 3:30 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు.ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించినా ఫలితం లేకపోయింది. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం. నారాయణ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9959002935 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

## సీఐ నర్సింహా రాజుకు ఘన వీడ్కోలు



**కూకట్పల్లి, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి):**

బాలానగర్ పోలీస్ స్టేషన్ నుంచి గచ్చిబౌలి ట్రాఫిక్ సీఐగా బదిలీపై వెళ్లిన టి. నర్సింహా రాజుకు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. సీఐ జి. ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్, బాలానగర్ ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి హాజరై నర్సింహా రాజును శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.డీసీపీ రితిరాజ్ మాట్లాడుతూ... నర్సింహా రాజు అందించిన సేవలు అభినందనీయమని, కొత్త బాధ్యతల్లోనూ అంకితభావంతో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఉన్నతాధికారులు, సహోద్యోగుల సహకారం మరువలేనిదని నర్సింహా రాజు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలి : దొడ్ల వెంకటేష్ గౌడ్



**కూకట్ పల్లి, జూలై 27 , (నవజ్యోతి ప్రతినిధి):**

ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు సవరణ (SIR) కార్యక్రమాన్ని బూత్ లెవెల్ అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని శంషిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సూచించారు. సోమవారం శంషిగూడలో జరుగుతున్న ఓటు మ్యాపింగ్ కార్యక్రమాన్ని ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫారంలో సరైన వివరాలు నమోదు చేసుకుని ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోరారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న ఓట్లను, నకిలీ ఓట్లను గుర్తించి తొలగించేలా బిఎల్ఓలు కృషి చేయాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటరు నమోదు ముఖ్యమని, ఈ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోపాల్, పోశెట్టిగౌడ్, సుధాకర్, అంజలి, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఆల్విన్ కాలనీ ప్రజావాణికి ఒకే ఫిర్యాదు




**కూకట్ పల్లి, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి) :**

కూకట్‌పల్లి జోన్ ఆల్విన్ కాలనీ సర్కిల్–51 కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు సంబంధించి ఒకే ఒక్క దరఖాస్తు నమోదైంది. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్, శానిటేషన్, యూసీడీ, వెటర్నరీ విభాగాలకు సున్నా ఫిర్యాదులు రాగా, అర్బన్ బయోడైవర్సిటీ విభాగానికి సంబంధించి ఒక వినతిపత్రం అందింది. ప్రజల నుంచి వచ్చిన అర్జీని పరిశీలించిన డిసి చాముండేశ్వరి, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటర్ల సర్వే, డిజిటలైజేషన్ పై రాజకీయ పార్టీలతో సమీక్ష



**కూకట్ పల్లి, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి) :**

ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలో ఓటర్ల జాబితా సవరణ, ఎస్ఐఆర్ (SIR) మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియపై సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏఈఆర్‌వో, డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి, స్పెషల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఈ భేటీ జరిగింది.ఓటర్ల వివరాల లింకేజీ, డిజిటలైజేషన్‌తో పాటు ఏఎస్‌డీడీ ఓటర్ల సర్వేను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితాలో పొరపాట్లు లేకుండా పారదర్శకంగా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బిఎల్ఓ సూపర్వైజర్లు, ఎన్నికల సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, బిఎల్ఓ సూపర్వైజర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## రూ. 25 లక్షలతో పైప్ లైన్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణారావు



**కూకట్ పల్లి, జూలై 27 , (నవజ్యోతి ప్రతినిధి):**

అల్లాపూర్ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్‌లో డ్రింకింగ్ వాటర్ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శ్రీకారం చుట్టారు. సోమవారం రూ. 25 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న 100 ఎంఎం డయా వాటర్ పైప్‌లైన్ నిర్మాణ పనులను ఆయన కొబ్బరికాయ కొట్టి అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రణాళికాబద్ధంగా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కాలనీల్లో ప్రజలకు మెరుగైన మంచినీటి సరఫరా అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. పైప్‌లైన్ పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జలమండలి అధికారులు, డివిజన్ పార్టీ నాయకులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలి

- **ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట రిమార్కులతో సకాలంలో పరిష్కరించాలి**
- **ప్రజావాణిలో 99 వినతులు స్వీకరణ.....జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి, జూలై 27 (నవజ్యోతి ప్రతినిది) :**

ప్రజావాణిలో ప్రజలు సమర్పించే ప్రతి ఫిర్యాదు, వినతిని అత్యంత బాధ్యతతో పరిశీలించి, నిర్దిష్ట రిమార్కులతో సకాలంలో, సమగ్రంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండులతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా జిల్లాకు వచ్చిన ఫిర్యాదులతో పాటు జిల్లా ప్రజావాణిలో అందిన వినతులను కూడా సంబంధిత శాఖలు అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును వాస్తవ పరిస్థితుల ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించి, స్పష్టమైన నివేదికలు, నిర్దిష్ట రిమార్కులతో పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని ఆదేశించారు. నేటి ప్రజావాణిలో మొత్తం 99 వినతులు అందాయి. వాటిలో సంగారెడ్డి డివిజన్‌కు 14, నారాయణఖేడ్ డివిజన్‌కు 5, జహీరాబాద్ డివిజన్‌కు 39, కలెక్టరేట్‌కు 41 వినతులు అందగా, అందోల్ డివిజన్‌కు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. అందిన వినతులు ప్రధానంగా రెవెన్యూ, ఉద్యానవన, వ్యవసాయం, పెన్షన్లు, ఇంటర్మీడియట్ విద్యాశాఖ, ఎస్సీ సంక్షేమం, బీసీ సంక్షేమం, పంచాయతీరాజ్, నీటిపారుదల, పోలీసు, రిజిస్ట్రేషన్, కార్మిక, విద్య, ఆర్టీసీ, పౌరసరఫరాలు, మహిళా మరియు శిశు సంక్షేమం, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖలు, పురపాలక సంస్థలకు సంబంధించినవి. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంగారెడ్డి ఆర్డీఓ, కలెక్టరేట్ రెవెన్యూ శాఖ అధికారులు, వివిధ విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## లక్ష్మీనగర్ కొత్త నాయకత్వానికి ఎమ్మెల్యే అభినందనలు

- **సంక్షేమ సంఘాలే కాలనీల బలం..ఎమ్మెల్యే సందేశం**
- **లక్ష్మీనగర్ అభివృద్ధి ఎజెండా..కొత్త కమిటీతో ఎమ్మెల్యే భేటీ**

**కుత్బుల్లాపూర్, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి):**



కాలనీల అభివృద్ధిలో నివాస సంక్షేమ సంఘాలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తాయని బీఆర్‌ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 129వ డివిజన్ సూరారం పరిధిలోని లక్ష్మీనగర్ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు నామిరెడ్డి అమృత, ప్రధాన కార్యదర్శి హరిశంకర్ రావుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యలను సమిష్టిగా పరిష్కరించడంలో వెల్ఫేర్ సంఘాల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. లక్ష్మీనగర్‌తో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అనేక కాలనీలు, బస్తీల్లో కోట్లాది రూపాయలతో రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా లక్ష్మీనగర్ సమగ్రాభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కొండకల్ల యాదిరెడ్డి, కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి, కోల శ్రీకాంత్ ముదిరాజ్, వెల్ఫేర్ అసోసియేషన్ సలహాదారులు సురేష్, కె. రాఘవేందర్ రెడ్డి, ఇంద్రసేన, ప్రభులింగం, కె.వి. రమణ, ఏ. వెంకటేశ్వర్ రావు, సభ్యులు సాయి ప్రేమ్, వెంకటప్ప రెడ్డి, ప్రసాద్ రెడ్డి, ఎన్. యశ్వంత్ రెడ్డి, క్రిష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత : ఆరెకపూడి గాంధీ

**కూకట్ పల్లి, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి):**

మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని, మానవాళి మనుగడకు మొక్కలే శ్రీరామరక్ష అని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని తులసి వనం అపార్ట్మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... తులసి వనం అపార్ట్మెంట్స్ నిర్వాహకులు మొక్కలు నాటి ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలిచారని అభినందించారు. సమస్త జీవకోటికి ప్రాణాధారమైన ఆక్సిజన్ ప్రాముఖ్యతను కరోనా సమయంలో అందరూ గుర్తించారని, భవిష్యత్తు తరాల కోసం ఖాళీ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా విస్తృతంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.నాటిన మొక్కలను చిన్న పిల్లలలాగా జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అడవుల శాతాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ హరిత కార్యక్రమంలో మహిళలు, పిల్లలు, యువకులు, వృద్ధులను భాగస్వాములను చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, తులసి వనం అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక

- **సదాశివపేట పట్టణ, మండల అధ్యక్షుడిగా చిరు ఏకగ్రీవ ఎన్నిక.**

**సదాశివపేట, జూలై 27 (నవజ్యోతిప్రతినిధి)**

అంబేద్కర్ యువజన సంఘం సదాశివపేట పట్టణ , మండల అధ్యక్షుడిగా చిరంజీవి (చిరు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పంబల్ల దుర్గాప్రసాద్ చేతుల మీదుగా చిరుకు నియామక పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కో–ఆర్డినేటర్ ఎస్. వరుణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను యువతలో మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు సంఘం కృషి చేస్తోందని, నూతన అధ్యక్షుడు చిరంజీవి (చిరు) నాయకత్వంలో సంఘం మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు చిరంజీవి (చిరు) మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు, సమానత్వం, సామాజిక న్యాయం, విద్య, యువత సాధికారత కోసం సదాశివపేట పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. సదాశివపేట పట్టణానికి సంబంధించిన కమిటీ ఏర్పాటు చేస్తూ కమిటీ ఉప అధ్యక్షులుగా ఎం.సాయి కుమార్, బి. అనూప్ కుమార్ ప్రధాన కార్యదర్శులుగా ఎస్. సుధాకర్, పి. మహేష్, పి .భరత్, ఏ.విజయ్ కుమార్, బి. నరేష్ లను నియమిస్తూ పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే సదాశివపేట మండల పరిధిలోని ప్రతి గ్రామంలో త్వరితగతిన అంబేద్కర్ యువజన సంఘం కమిటీలను ఏర్పాటు చేసి, యువతను సంఘటితం చేస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు, రాజ్యాంగ విలువల ప్రచారం చేపడతామని తెలిపారు. యువత అందరూ సంఘం అభివృద్ధికి సహకరించి అంబేద్కర్ ఆశయాల సాధనలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, యువజన సభ్యులు, అంబేద్కర్ అభిమానులు, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొని నూతన అధ్యక్షుడు చిరంజీవికి శుభాకాంక్షలు తెలియజేశారు.



## ప్రభుత్వ స్థలాల కబ్జాపై ఎమ్మెల్యే మాధవరం ఆగ్రహం

**కూకట్‌పల్లి, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి) :**



అల్లాపూర్ డివిజన్ సర్వే నెంబర్ 18లోని నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ నాయకులు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపించారు. సోమవారం అల్లాపూర్ డివిజన్‌లో పర్యటించిన ఆయన.. కలెక్టర్ సహకారంతో సదరు స్థలం చుట్టూ ఫెన్సింగ్ పనులు చేపట్టినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో రూ. 50 లక్షలతో ప్రహరీ నిర్మించి, పేదల కోసం తెలుగు, ఉర్దూ మీడియం పాఠశాలలు, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని నిర్ణయించినట్లు గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి పాఠశాల భవనాలను నిర్మించాలని, లేనిపక్షంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మిస్తామని స్పష్టం చేశారు. కబ్జాలపై ఫిర్యాదు చేసినా రెవెన్యూ, హైడ్రా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. చెరువుల అభివృద్ధికి హైడ్రా కృషిని స్వాగతిస్తూనే.. ప్రజలను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సభియా గౌసుద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు మహమ్మద్ గౌసుద్దీన్, లింగాల ఐలయ్య, పిల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# మాడుగులపల్లి పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఎస్పీ

- ప్రజా సేవే పోలీసుల ప్రధాన ధ్యేయం - జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్



**మాడుగులపల్లి, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి) :**

పోలీసు స్టేషన్ల వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ సోమవారం మాడుగులపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిపాలన, రికార్డుల నిర్వహణ, నేరాల దర్యాప్తు, ప్రజలకు అందిస్తున్న సేవలు, పోలీసింగ్ నాణ్యత, స్టేషన్ పరిసరాల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. తనిఖీలో భాగంగా జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, కేసు డైరీలు, పెండింగ్ కేసుల వివరాలు, బెయిల్ నిబంధనల అమలు, సీసీటీఎన్ఎస్ నిర్వహణ, ఆయుధాల సంరక్షణ, విజిటర్ రిజిస్టర్, సిబ్బంది హాజరు రిజిస్టర్లు, స్టేషన్ రిసెప్షన్, పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించి అవసరమైన మార్గదర్శకాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రాధాన్యతతో విచారించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతతో స్వీకరించి, చట్టబద్ధంగా, పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించే విధంగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ జిల్లా పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, బాధితుల సమస్యలను ఓర్పుతో విని తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రేవ్ కేసుల దర్యాప్తును అత్యంత నాణ్యతతో నిర్వహించి, శాస్త్రీయ ఆధారాలు, సాంకేతిక సాక్ష్యాలను సమర్థంగా సేకరించి కోర్టులో బలమైన అభియోగపత్రాలు దాఖలు చేయడం ద్వారా నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయాలని సూచించారు. విల్లేజ్ పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, గ్రామస్థాయిలో ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ నేరాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణ, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా, సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు వంటి అంశాల్లో చురుకైన పాత్ర పోషించాలని ఆదేశించారు. గ్రామ పెద్దలు, యువత, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులతో సమన్వయం పెంచి కమ్యూనిటీ పోలీసింగ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. సైబర్ నేరాల నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్టు పేరుతో జరుగుతున్న మోసాలపై గ్రామాలు, విద్యాసంస్థలు, వ్యాపార వర్గాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, గంజాయి తదితర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన నిఘా కొనసాగించాలని ఆదేశించారు.

# బీజేపీ ఓబీసీ మోర్చా నూతన పదాధికారులకు సన్మానం



**కూకట్‌పల్లి, జూలై 27 , ( నవజ్యోతి ప్రతినిధి) :**

మేడ్చల్–మల్కాజ్గిరి (అర్బన్) జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా పదాధికారులుగా నియమితులైన అత్కరి మల్లేష్, సతీష్ గౌడ్, పండుగ రేణుక, తేజస్విని, శ్రవణ్ కుమార్, దిలీప్‌లను రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులను అభినందించారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని తెలిపారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న బీసీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు శేఖర్ యాదవ్ నాయకత్వంలో బీసీ వర్గాల అభివృద్ధికి కృషిచేస్తూ పార్టీ బలోపేతానికి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాలనీ సమస్యపై వెంటనే స్పందించిన ముప్పు శ్రీనివాస్ రెడ్డి

- వికాస్ నగర్ లో చెత్త, పిచ్చి మొక్కల తొలగింపు – కాలనీవాసుల హర్షం

**నాగారం, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి) :**

నాగారం డివిజన్ పరిధిలోని వికాస్ నగర్ కాలనీలో అపరిశుభ్ర వాతావరణంపై కాలనీవాసులు చేసిన ఫిర్యాదుకు నాగారం డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఎంవైఆర్ గార్డెన్స్, సెరెనిటీ మోడల్ హైస్కూల్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో విచ్చలవిడిగా చెత్త వేయడం, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో దుర్వాసన, దోమల సమస్యలు ఏర్పడి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించారు.దీనిపై సంబంధిత మున్సిపల్ అధికారులతో మాట్లాడిన ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ సిబ్బందితో కలిసి జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగించి, చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సమస్యను తక్షణమే పరిష్కరించిన ముప్పు శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ముప్పు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.



# కేపీహెచ్‌బీ సీఐ విజయ్‌కుమార్‌కు గోపాల్ చౌదరి శుభాకాంక్షలు




**కూకట్‌పల్లి, జూలై 27 , ( నవజ్యోతి ప్రతినిధి) :**

కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సీఐ విజయ్‌కుమార్‌ను సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, సోషల్ మీడియా వారియర్ పిడికిటి గోపాల్ చౌదరి మర్యాదపూర్వకంగా కలిశారు. పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఈ భేటీలో సీఐకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరసన ర్యాలీ ని విజయవంతం చేయండి

- యువజన విభాగం కార్యనిర్వహక సభ్యులు చల్లా సునీల్ కుమార్

**పులివెందుల, జులై 27 (నవజ్యోతి ప్రతినిధి) :**

కూటమి ప్రభుత్వం విద్యార్థులు ,యువత పై అవలంబిస్తున్న విధానాలు అలాగే డిఎస్సీ అక్రమాలపై వైఎస్ఆర్సీపీ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి , కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 28 వ తేదీ అనగా నేడు మంగళవారం కడప లో తలపెట్టిన నిరసన ర్యాలీలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కడప జిల్లా యువజన విభాగం కార్యనిర్వహక సభ్యులు చల్లా సునీల్ కుమార్ కోరారు.ఈ సందర్భంగా కడప జిల్లా యువజన విభాగం కార్యనిర్వహక సభ్యులు చల్లా సునీల్ కుమార్ వేముల లో మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో విద్యార్థులు నిరుద్యోగ యువతకు కూటమి, చంద్రబాబు నాయుడు అనేక హామీలు ఇచ్చారని అయితే ఎన్నికల్లో గెలిచి గద్దెనెక్కిన తర్వాత వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా వెన్నుపోటు పొడిచారు అన్నారు. డీఎస్సీ స్కాంపై సిబిఐ తో విచారణ చేపట్టాలని , డీఎస్సీ ఉద్యోగాల భర్తీలో జరిగిన స్కామ్ వల్ల క్రీడ కోట కింద అనేకమంది ప్రతిభ గల అభ్యర్థులు ఉద్యోగులు పొందలేక పోయారు అని,ఆవేదన వ్యక్తం చేశారు.గత ఎన్నికల లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. నేడు కడప లో జరిగిన నిరసన ర్యాలీ లో విద్యార్థులు నిరుద్యోగులు యువత పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమం ను విజయవంతం చేయాలి అని పిలుపునిచ్చారు.



# రామాయంపేటలో నియోజకవర్గ స్థాయి మాల సంఘాల ప్రాంతీయ సదస్సు

- ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ విధానంతో మాలలకు అన్యాయం: మాల మహానాడు
- రిజర్వేషన్ హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటం చేయాలి.

**రామాయంపేట, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్) :**

ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ విధానాల కారణంగా మాలలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మాసాయిపేట మల్లేశం పేర్కొన్నారు.మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మాల, మాల ఉపకులాల ప్రతినిధుల ప్రాంతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ప్రస్తుతం అమల్లో ఉన్న ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ విధానం కారణంగా మాలలకు కేటాయించే రోస్టర్ పాయింట్లు తగ్గిపోతున్నాయని, దీనివల్ల విద్యార్థులు,నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ విధానాన్ని పునఃసమీక్షించి సామాజిక న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఎంసీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కళా మాట్లాడుతూ, ఎస్సీ రిజర్వేషన్లలో మాలలకు రోస్టర్ పాయింట్ 22కు పరిమితం చేయడం వల్ల విద్య, ఉద్యోగ నియామకాలలో అన్యాయం జరుగుతోందని అన్నారు. రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కులను పరిరక్షించేందుకు మాల సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.సదస్సులో రిజర్వేషన్ హక్కుల పరిరక్షణ,విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులకు న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మాల సంఘాల ప్రతినిధులు, నాయకులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.




# లక్ష్మాపూర్-దంతేపల్లి రహదారి పనులు వెంటనే ప్రారంభించాలి



- ప్రజావాణిలో జేసీకి వినతి
- ప్రజావాణిలో జాయింట్ కలెక్టర్‌కు సర్పంచ్ బలరాజ్ వినతి.
- రూ.4.13 కోట్లతో టెండర్ పూర్తై మూడేళ్లు గడిచినా ముందుకు కదలని పనులు.
- ఆరు గ్రామాల ప్రజలు,విద్యార్థులు,రైతులు, ప్రయాణికులకు నిత్యం అవస్థలు.

**రామాయంపేట, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్) :**

లక్ష్మాపూర్ స్టేజ్ నుంచి దంతేపల్లి గ్రామం వరకు ప్రతిపాదిత బీటీ రహదారి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ దంతేపల్లి గ్రామ సర్పంచ్ మస్కూరి బాలరాజు,సోమవారం మెదక్ జిల్లా ప్రజావాణిలో జాయింట్ కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. లక్ష్మాపూర్, కాట్రియాల్, పర్వతాపూర్, కిషన్ తండా,జెమ్లాతండా,దంతేపల్లి గ్రామాలను కలుపుతూ ఉన్న ఈ ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని భారీ గుంతలతో ప్రమాదకరంగా మారిందన్నారు.ఈ రహదారిపై ప్రతిరోజూ ఆర్టీసీ బస్సు పాఠశాల వాహనాలు,వ్యవసాయ వాహనాలు,ద్విచక్ర, ఆటోలు ,నాలుగు చక్రాల వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నప్పటికీ,రహదారి అధ్వాన్నంగా ఉండటంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ రహదారి నిర్మాణానికి రూ.4.13 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరై టెండర్ ప్రక్రియ పూర్తై మూడు సంవత్సరాలు గడిచినా కాంట్రాక్టర్ ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 20 ఏళ్ల క్రితం నిర్మించిన రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలకు కారణమవుతోందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, విద్యార్థుల రాకపోకలు,రైతుల వ్యవసాయ ఉత్పత్తుల రవాణా తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని వివరించారు. ఈ సమస్యను ఇప్పటికే ఎమ్మెల్యే, ఎంపీ తో పాటు సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత కాంట్రాక్టర్‌ను వెంటనే పిలిపించి రహదారి నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌ను కోరారు.

# గ్రామ పంచాయతీ నిధులను దుర్వినియోగం చేసిన సర్పంచ్ పై ఫిర్యాదు

**టేక్మాల్, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి) :**

గ్రామపంచాయతీ నిధులను ఇష్ట రాజ్యాంగ విత్ డ్రా లు చేసిన సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలని గ్రామ వార్డు మెంబర్లు ప్రజలు ఎంపీడీవో సత్యనారాయణకు ఫిర్యాదు అందజేశారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని బొడ్మట్ పల్లి గ్రామ సర్పంచ్ తలారి అవినాష్ కుమార్ గ్రామపంచాయతీలో పనులు అంతంత మాత్రం జరుగుతున్న నిధులు మాత్రం ఆరు నెలల్లో దాదాపుగా 11 లక్షల రూపాయలు విత్ డ్రా చేసిన విధానానికి గ్రామ ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు.గత కొన్ని రోజుల క్రితం ఒక వార్డ్ మెంబర్ పంచాయతీ లెక్కలు చెప్పమని కోరగా నువ్వెంత నీ స్థాయి ఎంత ఆఫ్టాల్ వార్డు మెంబర్ నువ్వు నాకే లెక్కలు అడిగే స్థాయానిది అని దురుసుగా మాట్లాడారు. ఇలా అడ్డగోలుగా నిధులను దుర్వినియోగం చేసిన సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలని వార్డు మెంబర్లు ,నాయకులు కోరుతున్నారు. ఫిర్యాదు చేసిన వారిలో గ్రామ వార్డుమెంబర్లు కంకర భూషణం, గడ్డం గోపాల్, మహమ్మద్ కరీం గ్రామస్తులు కొటంగారి శంకరయ్య, తంపులూరి నర్సింలు, దప్పు పెంటయ్య ఉన్నారు.



## విద్యార్థులకు సరి అయిన విద్య అందడం లేదు



**ఉమ్మడి మెదక్ జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి) :**

మెదక్ జిల్లా అల్లాదుర్గ్ మండలం ముస్లాపూర్ మండలం ప్రజా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 130 మంది విద్యార్థులు ఉన్నారు. కానీ ఇక్కడ పాఠాలు బోధించే ఉపాధ్యాయులు ముగ్గురు మాత్రమే, ఉపాధ్యాయులు ఒక్కరు మీటింగ్ ఇంకొక ఉపాధ్యాయులు డిప్రెషన్ ఒక ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ఒక క్లాస్ విద్యార్థులకు పాఠాలు బోధిస్తుంటే మిగతా క్లాస్ విద్యార్థులకుచదువు చెప్పే ఉపాధ్యాయులు లేక చదువు రాక విచ్చలవిడిగా విద్యార్థులు ఆడుకుంటూ కనబడ్డిది. పునాది బాగుంటానే ఇల్లు బాగుంటది, అలాంటి విద్యార్థులకు విద్య అందక విద్యార్థులు చదువు రాక ఇబ్బందులకుగురవుతున్నారు. ఇక్కడచదువుకోవడానికి సర్కార్ బడిలో చదువు కోవడానికి వ్యవసాయం కూలి పని చేసే వారు కాబట్టి ఇప్పటికైనా విద్యార్థులకు విద్య సరిగా అందేలా జిల్లా అధికారులు స్పందించి ఇక్కడ సరిపడ్డ ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## విద్యాశాఖ మంత్రి లోకేష్ వెంటనే రాజీనామా చేయాలి..మండల కన్వీనర్,జడ్పీటీసీ



**పులివెందుల, జులై 27 (నవజ్యోతి ప్రతినిధి) :**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా స్ఫూర్తితో, ఏపీలో డీఎస్సీ పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని వైఎస్ఆర్సీపీ మండల కన్వీనర్ నాగెళ్ళ సాంబశివరెడ్డి వేముల జడ్పీటీసీ కోకటం వెంకట బయపు రెడ్డి డిమాండ్ చేశారు.సోమవారం ఉదయం స్థానిక వేముల మండలం లోని స్థానిక వేముల వైఎస్ఆర్సీపీ పార్టీ కార్యాలయం నందు పత్రిక సమావేశం నిర్వహించారు. డీఎస్సీ పరీక్షా విధానంలో అవకతవకలు, పేపర్ లీకేజీలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి.కేంద్రంలో ఒకలా, రాష్ట్రంలో మరోలా కాకుండా నైతిక బాధ్యత వహించి లోకేష్ వైదొలగాలని డిమాండ్ చేశారు అలాగే ఈ సమగ్ర వ్యవహారంపై సీబీఐ లేదా స్వతంత్ర సంస్థతో విచారణ జరపాలని కోరుతున్నారు.

## కేటీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ...

- **అలంఖాన్ గూడలో కైలా సుమతమ్మ – సుక్క రెడ్డి దంపతుల సేవా కార్యక్రమం.**
- **విద్యే సమాజ అభివృద్ధికి పునాది.. విద్యార్థులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపు.**




**ఉమ్మడి రంగారెడ్డి/ శంకర్ పల్లి, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి) :**

భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అలంఖాన్ గూడ గ్రామంలో కైలా సుమతమ్మ – సుక్క రెడ్డి దంపతులు ఆదర్శప్రాయమైన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని విద్యార్థులకు పరీక్షల కోసం అవసరమైన ఎగ్జామ్ ప్యాడ్స్, షూస్, సాక్స్, స్టడీ మెటీరియల్స్, ఇంగ్లీష్ కాపీ రైటింగ్ బుక్స్ తదితర విద్యా సామగ్రిని అందజేసి వారి చదువుకు తమ వంతు ప్రోత్సాహాన్ని అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందుకున్న చిన్నారులు ఆనందం వ్యక్తం చేస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కైలా సుమతమ్మ – సుక్క రెడ్డి దంపతులు మాట్లాడుతూ విద్యే ప్రతి ఒక్కరి జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లే గొప్ప ఆయుధమని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కేటీఆర్ జన్మదినాన్ని కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా విద్య, వైద్యం, సామాజిక సేవా కార్యక్రమాల్లో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. గ్రామాభివృద్ధితో పాటు విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, సమాజంలోని దాతలు కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, యువకులు, మహిళలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# శ్రీ శంకర ప్రైవేట్ స్కూల్‌లో నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలి

- **అనుమతి లేకుండా పుస్తకాలు, యూనిఫాంల విక్రయం జరుగుతోందని యూఎస్ఎఫ్ఐ ఆరోపణ**
- **పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించని ఎంఈఓ : జగన్**
- **డీఈఓ జోక్యం చేసుకుని విచారణ చేపట్టాలని డిమాండ్**

**రామాయంపేట, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్) :**



రామాయంపేట మండల కేంద్రంలోని శ్రీ శంకర ప్రైవేట్ స్కూల్ లో విద్యాశాఖ అనుమతి లేకుండా పుస్తకాలు, యూనిఫాంల విక్రయం జరుగుతోందని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జగన్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని విమర్శించారు. పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని, కనీస మౌలిక సదుపాయాలు లేకుండానే పాఠశాలను నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ అంశాలపై పలుమార్లు మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) వెంటనే జోక్యం చేసుకుని పాఠశాలలో జరుగుతున్న వ్యవహారాలపై సమగ్ర విచారణ నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించినట్లయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి భూపాల్ పాల్గొన్నారు.

# డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంకు జనసేన పార్టీ ఘన నివాళి

- **కలాం ఆశయాలు యువతకు స్ఫూర్తి కావాలి: జనసేన నాయకులు**

**కీసర, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి) :**



భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా దమ్మెగూడలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని జనసేన నాయకులు రవి రాజ్ రాథోడ్ మరియు వై. రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదటగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన దేశానికి అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రవి రాజ్ రాథోడ్ మాట్లాడుతూ, సాధారణ కుటుంబంలో జన్మించి తన కృషి, క్రమశిక్షణ, అంకితభావంతో భారత అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న అందుకుని, అనంతరం దేశ అత్యున్నత పదవైన రాష్ట్రపతిగా సేవలందించిన మహనీయుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని కొనియాడారు. భారతదేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా చేసిన మిసైల్ మ్యాన్‌గా కలాం గారు చిరస్థాయిగా నిలిచారని అన్నారు. యువత పెద్ద కలలు కనాలని, వాటిని సాధించేందుకు నిరంతరం శ్రమించాలని ఆయన ఇచ్చిన సందేశం నేటికీ ప్రతి యువకుడికి స్ఫూర్తినిస్తోందని పేర్కొన్నారు. దేశాభివృద్ధి, విద్య, విజ్ఞానం, క్రమశిక్షణ, దేశభక్తి వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని, కలాం గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీర మహిళలు బి. దివ్య, జ్యోతి, అలాగే వెంకటేష్, త్రినాథ్, రఘువీర్, జరుపుల హరినాయక్, కే. అక్షయ్, గురునాథ్, గోపి తదితరులు పాల్గొని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# ఏళ్ల నిరీక్షణకు ముగింపు..కుత్బుల్లాపూర్ రోడ్లకు కొత్త రూపు

- **రూ.270 కోట్ల రోడ్లకు వేగం..క్షేత్రస్థాయిలో మంత్రి శ్రీధర్ బాబు సమీక్ష**
- **అనుమతుల అడ్డంకులు దాటిన రోడ్లు..అమలుపై మంత్రి నేరుగా పర్యవేక్షణ**

**కుత్బుల్లాపూర్, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి) :**

నగర శివారు ప్రాంతాల్లో పెరుగుతున్న ట్రాఫిక్ ఒత్తిడికి శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపట్టిన రూ.270 కోట్ల రహదారి అభివృద్ధి పనులు కీలక దశకు చేరుకున్నాయి. కొంపల్లి–బహదూర్‌పల్లి రహదారి విస్తరణకు రూ.130 కోట్లు, గండిమైసమ్మ–మియాపూర్ రహదారి నిర్మాణానికి రూ.140 కోట్లతో కొనసాగుతున్న పనులను తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులతో సమీక్షించిన మంత్రి, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా నిర్ణీత గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఆదేశించారు. గత దశాబ్ద కాలంగా అటవీ శాఖ అనుమతుల సమస్యతో నిలిచిపోయిన ఈ ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వం చొరవతో తిరిగి గాడిలో పడ్డాయని పేర్కొన్నారు. అవసరమైన అనుమతులు సాధించిన అనంతరం పనులు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. బౌరంపేట్ రోడ్డులో జరుగుతున్న విస్తరణ పనులను జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించిన మంత్రి, అటవీ,



రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి పనుల్లో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణ నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ రహదారులు పూర్తయితే కొంపల్లి, బహదూర్‌పల్లి, గండిమైసమ్మ, బాచుపల్లి, మియాపూర్ ప్రాంతాల మధ్య ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, ప్రయాణ సమయం ఆదా కావడంతో పాటు పారిశ్రామిక, నివాస ప్రాంతాల మధ్య అనుసంధానం మరింత బలోపేతం కానుందని అధికారులు భావిస్తున్నారు. ఈ పర్యటనలో జిల్లా అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిబ్బంది కొరతతో "తల్లికి వందనం"లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు..

- **తక్షణమే రెగ్యులర్ వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ ను నియమించాలి..**

**పులివెందుల, జులై 27 (నవజ్యోతి ప్రతినిధి)**



రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆర్ ఎస్ ఓ రాష్ట్ర అధ్యక్షులు జగన్ డిమాండ్చేస్తూ పర్లపాడు గ్రామ సచివా లయంలో రెగ్యులర్ వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండటంతో గ్రామ ప్రజలు, ముఖ్యంగా "తల్లికి వందనం" పథకం లబ్ధి అందని తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఆర్ఎస్ఓ) రాష్ట్ర అధ్యక్షులు జగన్ తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ జమ్మలమడుగు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) శిరీష గారికి రాష్ట్ర అధ్యక్షులు జగన్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇన్‌చార్జి సిబ్బందిపై ఆధారపడుతున్న ప్రస్తుత పరిస్థితిలో వారు ఎప్పుడు కార్యాలయానికి వస్తారో, ఎప్పుడు అందుబాటులో ఉంటారో ప్రజలకు తెలియక సచివాలయం చుట్టూ పలుమార్లు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యంగా "తల్లికి వందనం" పథకం సంబంధిత వివరాల కోసం వచ్చే తల్లిదండ్రులకు సరైన సమాచారం అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందించాలనే ఉద్దేశంతో వ్యవస్థను ఏర్పాటు చేసినప్పటికీ, ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. కావున పర్లపాడు గ్రామ సచివాలయానికి తక్షణమే రెగ్యులర్ వెల్ఫేర్ అసిస్టెంట్, రెగ్యులర్ డిజిటల్ అసిస్టెంట్‌లను నియమించి, "తల్లికి వందనం"తో పాటు అన్ని ప్రభుత్వ సంక్షేమ సేవలు ప్రజలకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో శిరీష గారిని వినతిపత్రం ద్వారా కోరినట్లు తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కారం కాకపోతే రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని చేపడతామని వారు తెలియజేశారు.

# కుషాయిగూడలో ప్రమాదకరంగా మారిన మాన్‌హోల్స్

- **తాత్కాలిక కవర్లతో కాలం వెల్లదీస్తున్న స్థానికులు.. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం**

**కుషాయిగూడ, జూలై 27, (నవజ్యోతి ప్రతినిధి) :**



కుషాయిగూడ డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ కాలనీలో మాన్‌హోల్స్‌కు శాశ్వత కవర్లు లేకపోవడంతో స్థానికులు తాత్కాలికంగా ఇనుప పలకలు, ఇతర వస్తువులతో కవర్లు ఏర్పాటు చేసుకుని ప్రమాదాలను నివారించే ప్రయత్నం చేస్తున్నారు.స్థానికుల కథనం ప్రకారం, కాలనీలో ఇలాంటి సుమారు 10 మాన్‌హోల్స్ దెబ్బతిన్న స్థితిలో ఉండగా, సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ మాన్‌హోల్స్ మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని, పాదచారులు,చిన్నారులు, ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొన్నందున వెంటనే నాణ్యమైన మాన్‌హోల్ కవర్లు ఏర్పాటు చేసి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని కుషాయిగూడలోని దెబ్బతిన్న అన్ని మాన్‌హోల్స్‌ను తక్షణమే మరమ్మతు చేయాలని సంబంధిత అధికారులను కాలనీవాసులు కోరుతున్నారు.

# దంతేపల్లి మీదుగా కామారెడ్డి వరకు ఆర్టీసీ బస్సులు నడపాలి

- సర్పంచ్ బలరాజ్
- ప్రజావాణిలో జాయింట్ కలెక్టర్‌కు దంతేపల్లి సర్పంచ్ వినతి
- 18 గ్రామాల ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మూడు బస్సు ట్రిప్పులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- వెంటనే స్పందించిన జేసీ.. టీజీఆర్టీసీ డీఎంతో ఫోన్‌లో చర్చ.

**రామాయంపేట, జులై 27 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్) :**




మెదక్ జిల్లా రామాయంపేట మండలం దంతేపల్లి గ్రామం మీదుగా కామారెడ్డి వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని దంతేపల్లి గ్రామ సర్పంచ్ మస్కూరు బలరాజ్ ప్రజావాణి కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ మార్గంలో సరైన బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. మెదక్ నుంచి ఉదయం 6 గంటలకు, రామాయంపేట నుంచి మధ్యాహ్నం 1 గంటకు, సాయంత్రం 6 గంటలకు దంతేపల్లి మీదుగా కామారెడ్డి వరకు మూడు బస్సు ట్రిప్పులను ఏర్పాటు చేయడంతో పాటు ఆదివారాల్లో కూడా బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ బస్సు సౌకర్యం కల్పిస్తే మెదక్, కామారెడ్డి జిల్లాలకు చెందిన సుమారు 18 గ్రామాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.వినతి పై వెంటనే స్పందించిన జాయింట్ కలెక్టర్ టీజీఆర్టీసీ జిల్లా మేనేజర్ (డీఎం)తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాధ్యమైనంత త్వరగా నివేదిక సమర్పించి చర్యలు చేపట్టాలని సూచించరు.

# జలసిరి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలి

- ప్రత్యేక అధికారి సురేష్
- ఎల్‌నినో ప్రభావం, పంటల మార్పిడి పై అవగాహన సమావేశం
- ఫామ్‌పాండ్లు,సోక్‌పిట్లు,బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలకు ప్రాధాన్యం

**రామాయంపేట,జులై 27(నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :**




రామాయంపేట మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ ప్రత్యేక అధికారి సురేష్ (సీపీఓ) అధ్యక్షతన మండల సర్పంచులు, మండల స్థాయి అధికారులు, వి.బి.జీ.ఆర్.ఏ.ఎం.జీ (VBGRAMG) సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.సమావేశంలో జలసిరి కార్యక్రమాల అమలు,ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల మార్పిడి విధానాలు,నీటి వనరుల సంరక్షణ వంటి అంశాలపై సంబంధిత అధికారులు సర్పంచులకు వివరించారు.ఈ సందర్భంగా సర్పంచులు గ్రామాల్లో ఎదురవుతున్న సమస్యలు,పలు సందేహాలను అధికారుల దృష్టికి తీసుకురాగా,వాటిపై అధికారులు తగిన సూచనలు,వివరణలు అందించారు. ప్రత్యేక అధికారి సురేష్ మాట్లాడుతూ, జలసిరి కార్యక్రమాలను గ్రామాల్లో సమర్థవంతంగా అమలు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టేలా ఫామ్‌పాండ్లు,సోక్‌పిట్లు, బోర్‌వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్లు విస్తృతంగా నిర్మించాలని సూచించారు.నీటి సంరక్షణతో పాటు భూగర్భ జలాల పెంపునకు ప్రతి గ్రామపంచాయతీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఎంపీడీవో షాజోల్దిన్, వ్యవసాయ శాఖ అధికారి ప్రవీణ్ కుమార్,పశుసంవర్ధక శాఖ అధికారి,ఏఈ (పంచాయతీరాజ్), ఏఈ (ఆర్‌డబ్ల్యూఎస్), వి.బి.జీ.ఆర్. ఏ.ఎం.జీ సిబ్బంది,పంచాయతీ కార్యదర్శులు, మండలంలోని సర్పంచులు పాల్గొన్నారు.

# మిసైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంకు ఘన నివాళి

- కలాం ఆశయాలు యువతకు మార్గదర్శకం: ఏనుగు సుదర్శన్ రెడ్డి

**ఘట్కేసర్, జులై 27,(నవజ్యోతి ప్రతినిధి) :**

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఏదులాబాద్ డివిజన్ ఔషాపూర్ గ్రామంలో భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశాభివృద్ధికి జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత శాస్త్రవేత్త, దూరదృష్టి కలిగిన రాష్ట్రపతి అని కొనియాడారు. శాస్త్ర సాంకేతిక రంగంలో భారతదేశానికి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు.యువత పెద్ద కలలు కనాలని, వాటిని సాధించేందుకు కృషి చేయాలని కలాం ఇచ్చిన సందేశం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా దేశసేవనే ధ్యేయంగా జీవించిన కలాం ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆయన చూపిన మార్గంలో నడవడమే నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏనుగు



మచ్చేందర్ రెడ్డి, బండారు పవన్ రెడ్డి,కన్నెబోయిన రాము యాదవ్,హరీష్ యాదవ్,ఏనుగు రఘురాం రెడ్డి,జీహెచ్‌ఎంసీ బీసీ సంఘం ఉపాధ్యక్షులు, అఖిల భారత రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మరాజు సతీష్ కుమార్, కాసుల వెంకటేష్ గౌడ్, సాయిలు, మహేష్‌తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

# తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై ప్రజల తరఫున వినతి

- ప్రజా సమస్యలపై ఫోకస్..హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారిని కలిసిన వారాల వినోద్ కుమార్
- వినతి నుంచి చర్యల దిశగా..నీటి సమస్యలపై అధికారుల హామీ

**కుత్బుల్లాపూర్, జులై 26:(నవజ్యోతి ప్రతినిధి) :**



కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద సూచన మేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వారాల వినోద్ కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్ జీడిమెట్ల డివిజన్ జీఎం మాధవికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న తాగునీటి సరఫరా అంతరాయాలు, డ్రైనేజీ సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారిణి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను ప్రాధాన్యతగా పరిగణించి, సంబంధిత ప్రాంతాల్లో త్వరితగతిన చర్యలు చేపట్టి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారిణి మాధవి హామీ ఇచ్చినట్లు వారాల వినోద్ కుమార్ తెలిపారు. ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపడేలా నిరంతరం సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్ ముదిరాజ్, వేణు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల దృష్టికి మరోసారి..జైశ్రీరామ్ నగర్ గోడు

- వర్షా లో విలవిల..జైశ్రీరామ్ నగర్ వైపు చూడండి..!
- ప్రజా సమస్యలపై జోనల్ కార్యాలయానికి బీఆర్ఎస్ నాయకుడు

**కుత్బుల్లాపూర్, జులై 28 (నవజ్యోతి ప్రతినిధి)**



అభివృద్ధి మాటల్లో కనిపిస్తున్నా.. జైశ్రీరామ్ నగర్ ప్రజలకు మాత్రం వర్షాకాలం వచ్చిందంటే ఇబ్బందుల కాలమే. దెబ్బతిన్న కల్వర్టు, గుంతలతో నిండిన రహదారులు, నిలిచిపోయే వర్షపు నీరు స్థానికులను నిత్యం ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఎన్నిసార్లు సమస్యలను ప్రస్తావించినా పరిష్కారం కనిపించకపోవడంతో ప్రజల తరఫున మరోసారి అధికారుల గడప తట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పీ. వివేకానంద ఆదేశాల మేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో సూపర్‌డెంట్ సత్యనారాయణని కలిసి వినతి పత్రం సమర్పించారు. కాలనీలోని కల్వర్టు ప్రమాదకరంగా మారిందని, రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో వృద్ధులు, మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అత్యవసరంగా మరమ్మతులు చేపట్టి, శాశ్వత పరిష్కారం కల్పించాలని కోరారు. వినతిపై స్పందించిన అధికారులు సమస్యను ప్రాధాన్యంగా తీసుకుని సంబంధిత విభాగాలతో సమన్వయం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రాజ్‌కుమార్ ముదిరాజ్, వేణు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరూర్ లో సామూహిక అగ్నిహోత్ర ప్రచారం.




**సదాశివపేట, జులై 27 (నవజ్యోతి ప్రతినిధి) :**

సదాశివపేట మండలంలోని ఆరూరు గ్రామంలో పర్యావరణ శుద్ధీకరణ సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో విశ్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అగ్నిహోత్ర ప్రచారం, బారి సముహిక అగ్నిహోత్ర కార్యక్రమాన్ని నిర్వాహించారు. పెరుగుతున్న కాలుష్యం, మానసిక ఒత్తిడి ఉన్న ఈ కాలంలో, ప్రాచీన వేద విజ్ఞానమైన అగ్నిహోత్ర ను పునఃపరిచయం చేయడం. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాల్లో కేవలం 10 నిమిషాల పాటు నిర్వహించే ఈ ప్రక్రియ, గాలిలోని విషతుల్యాలను తొలగించి, ఒత్తిడిని తగ్గిస్తుందని శాస్త్రీయంగా నిరూపించబడింది. ప్రత్యక్ష ప్రదర్శన రాగి పిరమిడ్, ఎండిన ఆవు పేడ బిళ్లలు, స్వచ్ఛమైన నెయ్యి మరియు అక్షింతలను ఉపయోగించి అగ్నిహోత్రాన్ని నిర్వహించే సరైన పద్ధతిని నిపుణులు ప్రత్యక్షంగా చూపిస్తారు.

**సాముహిక అగ్నిహోత్రం.**

ఖచ్చితమైన సూర్యోదయ సూర్యాస్తమయ సమయంలో అందరూ కలిసి ఒకేసారి అగ్నిహోత్రం నిర్వహించి, శక్తివంతమైన సామూహిక స్వస్థత శక్తిని సృష్టిస్తారు. సేంద్రీయ వ్యవసాయం, నీటి వనరుల శుద్ధీకరణ,మానవ రోగనిరోధక శక్తిని పెంచడంలో అగ్నిహోత్రం ఎలా సహాయపడుతుందనే అంశంపై ప్రసంగంతో కార్యక్రమం ముగుస్తుంది. నిర్వాహకుల సందేశం అగ్నిహోత్రం అనేది కేవలం ఒక సంప్రదాయం మాత్రమే కాదు. ఇది పర్యావరణ, మానసిక శాంతి కోసం వేద కాలపు మహర్షులు మానవాళికి అందించిన వరం. కాలుష్య ప్రభావం నుండి మన భావి తరాలను రక్షించే స్వస్థత చేకూర్చే అగ్ని గురించి ప్రతి ఇంటికీ అవగాహన కల్పించడమే అగ్నిహోత్ర యొక్క మా లక్ష్యం అని, విశ్వ ఫౌండేషన్ శిక్షణ సమన్వయకర్త విశ్వ ఫౌండేషన్ ధర్మ సైనికులు పేర్కొన్నారు.

# నాలుగు గుంటల భూమిని భూదానం చేసిన మాజీ సర్పంచ్ పట్లోళ్ల అమరేందర్ రెడ్డి.

- భూమి విలువ 20 లక్షలు.
- దానం చేయడంలోనే పరమానందం అంటున్న మాజీ సర్పంచ్.



**సదాశివపేట, జులై 27 (నవజ్యోతిప్రతినిధి) :**

సదాశివపేట మండల పరిధిలోని ఆత్మకూరు గ్రామంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి ఆత్మకూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పట్లోళ్ల సరళ అమరేందర్ రెడ్డి ఆలయ నిర్మాణానికి నాలుగు గుంటల విలువైన భూమిని ఆలయానికి దానం సుమారు 20 లక్షల విలువైన భూమిని దానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామంలోని పెద్దలందరూ పాల్గొని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సంగమేశ్వరా చారి మాట్లాడుతూ ఎంతో విలువైన భూమిని ఆలయానికి ఇవ్వడం చాలా సంతోషకరమని, వారి కుటుంబ సభ్యులకు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి యొక్క ఆశీర్వాదం ఉండాలని కోరారు. సందర్భంగా ఆత్మకూరు గ్రామ సర్పంచ్ నికిత బింభదర్ చారి మాట్లాడుతూ విలువైన భూమిని ఆలయానికి ఇవ్వడం చాలా గొప్ప విషయం అని, డబ్బు చాలామంది దగ్గర ఉంటుంది, కానీ దానం చేసే కొందరిలో ఉంటుందని ఆ కొందరిలో మా ఊరిలోని అమరేందర్ రెడ్డి ముందు వరుసలో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు గురురాజు స్వామి, కల్పగూరి ప్రభు, నాగయ్య స్వామి, రమేష్, వినోద్, మరియు ఆలయ కమిటీ సభ్యులు సంగమేశ్వర్ చారి,బక్కన్న చారి , రాములు చారి,నర్సింలు చారి, సదాశివుడు చారి,వీరన్న చారి, రామచందర్ చారి,నిరంజన్ చారి, భిక్షపతి చారి,అనిల్ చారి పాల్గొన్నారు.

# చైన్ స్నాచర్ కు కాలనీ కౌంటర్... పరారీలోనే పట్టివేత!

- సీసీ కెమెరా సాక్షిగా...స్నాచర్ ఆటకట్టు!
- ఇంటి గుమ్మంలో స్నాచింగ్...వీధిలోనే దొంగకు ముగింపు!

**కుత్బుల్లాపూర్, జులై 27 (నవజ్యోతి ప్రతినిధి):**



పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చైన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. సుచిత్ర సెంటర్ సమీపంలోని హెచ్‌ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో నివాసముంటున్న వెంకాయమ్మ (80) అనే మహిళ ఇంట్లో ఉండగా, ఓ దుండగుడు ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో ఉన్న పుస్తెల తాడును బలవంతంగా లాక్కొని పరారయ్యేందుకు యత్నించాడు. అయితే బాధితురాలు పెద్దగా కేకలు వేయడంతో అప్రమత్తమైన కాలనీవాసులు వెంటనే దుండగుడిని వెంబడించారు. కొద్ది దూరంలో అతడిని పట్టుకుని దేహశుద్ధి చేసి అనంతరం పేట్ బషీరాబాద్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించిన దుండగుడి పరుగు దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. దుండగుడు గతంలో కూడా ఇలాంటి నేరాలకు పాల్పడ్డాడా? ఒంటరిగా వచ్చాడా? లేక మరెవరైనా సహచరులు ఉన్నారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఘటనతో రాఘవేంద్ర కాలనీలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికులు కాలనీల్లో పోలీసు గస్తీ మరింత పెంచాలని కోరుతున్నారు.

## జర్మనీలో ఉద్యోగాల కోసం నర్సింగ్, ఫిజియోథెరపీ అభ్యర్థులకు ఉచిత జర్మన్ భాషా శిక్షణ

**ఖమ్మం, జూలై 27**

ఉమ్మడి ఖమ్మం జిల్లా నర్సింగ్, ఫిజియోథెరపీ కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులకు జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కార్యాలయం టామ్‌కామ్ ఆధ్వర్యంలో త్వరలో ఉచిత జర్మన్ భాషా శిక్షణ ప్రారంభించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి తెలిపారు. శిక్షణ అనంతరం అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి జర్మనీలో ఉద్యోగాల కోసం షరతులతో కూడిన ఉద్యోగ ఎంపిక ధ్రువీకరణ పత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఖమ్మం కలెక్టరేట్ మొదటి అంతస్తులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

## జర్మనీలో ఉద్యోగాల కోసం నర్సింగ్, ఫిజియోథెరపీ అభ్యర్థులకు ఉచిత జర్మన్ భాషా శిక్షణ

**ఖమ్మం, జూలై 27 :**

ఉమ్మడి ఖమ్మం జిల్లా నర్సింగ్, ఫిజియోథెరపీ కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులకు జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కార్యాలయం టామ్‌కామ్ ఆధ్వర్యంలో త్వరలో ఉచిత జర్మన్ భాషా శిక్షణ ప్రారంభించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి తెలిపారు. శిక్షణ అనంతరం అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి జర్మనీలో ఉద్యోగాల కోసం షరతులతో కూడిన ఉద్యోగ ఎంపిక ధ్రువీకరణ పత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఖమ్మం కలెక్టరేట్ మొదటి అంతస్తులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

## సిద్దిపేట రైతులకు కీలక ప్రకటన

### 27 నుంచి 29 వరకు ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళా



**సిద్దిపేట, జూలై 27**

సిద్దిపేట జిల్లాలోని రైతుల కోసం ఈ నెల 27, 28, 29 తేదీల్లో జిల్లాలోని 26 మండలాల్లోని ఒక్కో రైతు వేదికలో ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రకటించింది.

మేళాలో చిరుధాన్యాలు (జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు), పప్పుధాన్యాలు (కందులు, మినుములు, పెసర, బొబ్బర్లు), నూనెగింజల పంటలు (ప్రొద్దుతిరుగుడు, నువ్వులు, ఆముదం) తదితర నాణ్యమైన ధృవీకరించిన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంటాయి. ప్రస్తుత నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు ఈ మేళా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు తమ మండలంలోని రైతు వేదికలో జరిగే విత్తన మేళాలో పాల్గొని నాణ్యమైన విత్తనాలను పొందాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం విజ్ఞప్తి చేసింది.

## పింఛన్ దారులు దివ్యాంగులు, వయోవృద్ధులకు టిఫిన్ తాగు నీరు ఏర్పాటు చేసిన కౌన్సిలర్



**కొడంగల్ మున్సిపల్,27(సమయం న్యూస్)**

కొడంగల్ మున్సిపల్ 2వ వార్డు కౌన్సిలర్ ఆర్. వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ తండ్రి కీర్తిశేషులు ర్యాలపేట రాములు జ్ఞాపకార్థం కొడంగల్ మున్సిపల్ రెండవ వార్డ్ లో పోస్ట్ ఆఫీస్ దగ్గర పింఛన్ కోసం వచ్చిన దివ్యాంగులు,వయోవృద్ధులు, వితంతువులకు టిఫిన్, తాగు నీరు ఏర్పాటు చేసిన కొడంగల్ మున్సిపల్ రెండవ వార్డ్ కౌన్సిలర్ ఆర్.వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ దంపతులు. ఈ కార్యక్రమంలో అవుసుల పరమేష్. బుక్క శివ. కేపీ.శివ, బుక్క శ్రీకాంత్. బాపన్ గేరి మోహన్, కటిక మహేష్, హోటల్ చిన్న, మంగలి శేఖర్, కొక్కల చందు, సల్కంపేట మోహన్, బండి గోపాల్, శివారెడ్డి, బాకారం బాల్రెడ్డి, తండ్ర గౌరీ శంకర్, పాశం సత్యప్ప.దుద్యాల శ్రీను, కేపీ రాకేష్,దుద్యాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**హైదరాబాద్, జూలై 27**

ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును నిర్దేశిత గడువులోగా పారదర్శకంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 88 వినతులను స్వీకరించారు.అనంతరం ఆర్డీవోలు, తహసీల్దార్లు, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ప్రాధాన్యత ఆధారంగా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవో, డిప్యూటీ కలెక్టర్‌తో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్న..

## జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి !

**సంగారెడ్డి, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి) :**

హత్నూర సమీపంలోని పురాతన దత్తలయ్య గుట్టలో వెలసిన దత్తాత్రేయ స్వామి క్షేత్రాన్ని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టి యు డబ్ల్యూ జె- ఐ జె యు) సంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షుడు బండారు యాదగిరి సోమవారం సందర్శించారు. దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ సభాపతి శర్మ ఆధ్వర్యంలో పూజారులు చంద్రప్రకాష్ శర్మ, సూర్య ప్రకాష్ శర్మ అర్చన జరిపారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఆలయ మర్యాదలతో వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరిని సత్కరించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ... ఈ దత్తాత్రేయ క్షేత్రానికి 650 సంవత్సరాల చరిత్ర ఉన్నదని అన్నారు.ఈ క్షేత్రంలో ఏటా గురు పౌర్ణమిని పురస్కరించుకొని మూడు రోజులపాటు పెద్ద ఎత్తున



బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అందుకని స్వామివారిని దర్శించుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర రాజధాని హైదరాబాదు తో పాటు పరిసర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు ఈ క్షేత్రానికి వస్తారు.ఈసారి కూడా సోమవారం ఉదయం ఈ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, చండీ హోమం, ద్వీప ప్రజ్వలన జరిపారు. దత్తాత్రేయునికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గురు పౌర్ణమిని పురస్కరించుకొని తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆలయ చైర్మన్ సభాపతి శర్మ తెలిపారు. వేలాదిగా తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఉమ్మడి మెదక్ జిల్లా టియుడబ్ల్యూజే (ఐ జేయు) మాజీ ప్రధాన కార్యదర్శి పానుగంటి కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు శివన్న జైన్ ,వెన్న చక్రేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ప్రసాద్ బాబు రాజు మృతి పార్టీకి తీరని లోటు.

### ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

**వాజేడు, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి):**

వాజేడు మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దంతులూరి విశ్వనాథ ప్రసాద్ బాబు రాజు (ప్రసాద్ బాబు) ఆకస్మిక మరణం పట్ల స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం వారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, ప్రసాద్ బాబు రాజు మరణం కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యంగా వాజేడు మండల కాంగ్రెస్ పార్టీ కుటుంబానికి తీరని లోటు అని పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధి కోసం, ప్రజా సేవ కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ప్రసాద్ బాబు రాజు ప్రజలతో ఎంతో ఆప్యాయంగా మెలుగుతూ, పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన సేవలను స్మరిస్తూ నివాళులర్పించిన ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఈయెక్క



కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని ప్రసాద్ బాబు రాజు గారికి ఘనంగా నివాళులర్పించారు.

# నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు...

- వలస కూలీల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు.
- ప్రధానోపాధ్యాయుడు మర్పల్లి అశోక్ వినూత్న చైతన్య కార్యక్రమం.

**ఉమ్మడి రంగారెడ్డి/ షాబాద్, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి) :**



నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు ప్రతి చిన్నారి విద్యకు దూరం కాకూడదు అనే మహోన్నత లక్ష్యంతో షాబాద్ మండలంలోని మన్మర్రి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మర్పల్లి అశోక్ చేపట్టిన చైతన్య కార్యక్రమం అందరి ప్రశంసలు అందుకుంటోంది. కర్నూలు జిల్లాకు చెందిన వలస కూలీల కుటుంబాలు మన్మర్రి గ్రామానికి ఉపాధి కోసం రావడంతో, వారి పిల్లలు విద్యకు దూరమవుతున్న విషయాన్ని గుర్తించిన ప్రధానోపాధ్యాయుడు మర్పల్లి అశోక్ వెంటనే స్పందించారు. గ్రామ పాలకవర్గ సభ్యులతో కలిసి వలస కూలీల కుటుంబాలను స్వయంగా సందర్శించి, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భవాని, బోయ భాను, ఉపేంద్ర అనే పాఠశాల వయస్సు గల చిన్నారులను గుర్తించి వారి చదువుకు ఎలాంటి అంతరాయం కలగకుండా వెంటనే స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రతి చిన్నారికి విద్య అనేది రాజ్యాంగబద్ధమైన హక్కు అని విద్యతోనే వారి భవిష్యత్తు బంగారుమయం అవుతుందని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాల గురించి కూడా తల్లిదండ్రులకు వివరించారు. ఉచిత నాణ్యమైన విద్య, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫారాలు, ఉదయం రాగి జావా, పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ వంటి సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాలను ప్రతి చిన్నారి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వలసల కారణంగా పిల్లల చదువు మధ్యలో ఆగిపోకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, బాల్యంలోనే విద్యకు దూరమైతే భవిష్యత్తులో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. "నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు. వారి బంగారు భవిష్యత్తుకు విద్యే బలమైన పునాది. ప్రతి బడి వయస్సు గల చిన్నారిని తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యత" అని ప్రధానోపాధ్యాయుడు మర్పల్లి అశోక్ పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయుడు చేపట్టిన ఈ చైతన్య కార్యక్రమాన్ని గ్రామస్థులు అభినందిస్తూ, వలస కూలీల పిల్లలందరూ విద్యకు దూరం కాకుండా సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ లాలాపేట బందయ్య, వార్డు సభ్యులు కవిత వెంకటేష్, స్థానికులు చాకలి రమేష్, వలస కూలీల యజమాని లక్ష్మణ్, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన రహదారి దుస్థితిపై భగ్గుమన్న భారత రాష్ట్ర సమితి...

- లక్ష్మారెడ్డిగూడెం గేటు వద్ద భారీ నిరసన – ధర్నా.
- రెండున్నరేళ్లుగా ప్రజల కష్టాలు పట్టించుకోని ప్రభుత్వంపై మండిపాటు.
- గుంతలతో నిండిన రహదారితో నిత్యం ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణం.
- వెంటనే రహదారి నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక.
- ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దంటూ నాయకుల ఆగ్రహం.

**ఉమ్మడి రంగారెడ్డి/శంకర్ పల్లి, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి) :**




భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం శంకర్ పల్లి మండలంలోని లక్ష్మారెడ్డిగూడెం గేటు వద్ద ఆదివారం ఉదయం భారీ ఎత్తున నిరసన ధర్నా నిర్వహించారు. శంకర్ పల్లి ప్రధాన రహదారి నుంచి మైతాప్‌ఖాన్ గూడా కూడలి వరకు పూర్తిగా గుంతలతో దెబ్బతిన్న రహదారిని వెంటనే పునర్నిర్మించాలని డిమాండ్ చేస్తూ పార్టీ నాయకులు, గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు గండిచర్ల గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు దాటినా ప్రజలకు అత్యంత అవసరమైన ప్రధాన రహదారుల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రజలు ప్రతిరోజూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు మాత్రం స్పందించకపోవడం దురదృష్టకరమని అన్నారు. శంకర్ పల్లి ప్రధాన రహదారి నుంచి మైతాప్‌ఖాన్ గూడా కూడలి వరకు ఉన్న ఈ మార్గం రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలను అనుసంధానించే అత్యంత కీలక రహదారి అని తెలిపారు. ఈ కూడలి నుంచి నవాబ్ పేట, వికారాబాద్, మోమిన్ పేట, బంటారం, మర్పల్లి, గొల్లపల్లి, మల్కాపూర్, సంగారెడ్డి ప్రాంతాలకు వేలాది మంది ప్రజలు ప్రతిరోజూ ప్రయాణిస్తారని పేర్కొన్నారు. అలాంటి ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారిపోవడంతో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి దెబ్బతినడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అత్యవసర పరిస్థితుల్లో అనారోగ్యంతో ఉన్న వారిని ఆసుపత్రులకు తరలించే అంబులెన్సులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. వాహనాలు తరచూ చెడిపోవడం వల్ల రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రెండు జిల్లాల ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం, అధికారులు నిద్రమత్తులో ఉన్నట్టుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ రహదారిపై ఇకనైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని, ఆలస్యం చేయకుండా వెంటనే నాణ్యమైన రహదారి నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను విస్మరిస్తే భవిష్యత్తులో మరింత ఉధృతంగా ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి శంకర్ పల్లి మండల, మున్సిపల్ నాయకులు, లక్ష్మారెడ్డిగూడెం, మహాలింగాపురం గ్రామాల ప్రజలు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్ రెడ్డి, మాజీ ఎంపీపీ చిన్న నరసింహులు, సర్పంచ్ రాఘవేందర్ రెడ్డి, మాజీ సర్పంచులు ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి యాదగిరి, సీనియర్ నాయకులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

Printed, Published, Owned by MANNE LAXMAN Printed at Saketh Publications, 312, Trinetra Complex, Sangareddy, Telangana 502001 Published from SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001 P.H: 9908123780, Email:navajyothinews@gmail.com, RNI no. TGTEL/25/A2372, EDITOR: MANNE LAXMAN